2015 జూలై

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-

**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...

| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| అందమైన తోట | మామయ్య కథలు<br>ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 09 |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| హాగరు | స్త్రీల విభాగము<br>శ్రీమతి రేచల్ జోసఫ్‌గారు | 14 |
| మధ్యకాలము | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 16 |
| శ్రమలు | రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ | 18 |
| భూకంపములు | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | 20 |
| సాక్ష్యము | గంగిరెడ్డుల జోజన్న | 22 |
| అక్షరయజ్ఞం - | బైబిల్ క్విజ్<br>శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |

India Evangelistic & Relief Fellowship

| EVANGELISM | RELIEF |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



క్రీస్తునందు ప్రియులైన పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమున శుభములు.

ఈ వేసవి కాలంలో భయంకరమైన ఎండలు. ఈ సంపాదకీయం వ్రాస్తున్న సమయంలో కూడా ఎండలు మండిపోతున్నాయి. అందరూ చల్లని వాతవరణం కోసం వర్షాల కోసం ఎదురు చూస్తున్నట్లే మనం మహా దేవుడైన యేసుక్రీస్తున రెండవ రాకడ కొరకు ఎదురుచూస్తున్నాము. మారుతున్న మానవ విలువలు, మితిమీరి నాగరికత, ఎన్నో విషయాలు త్వరగా రాకడ రాబోతున్నవని చెప్పకనే చెబుతున్నాయి. చాలామంది "యుగాంతం" మీద పుస్తకాలు వ్రాసి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే వాటన్నిటికంటే ఎక్కువ విలువైనవి, అమూల్యమైన పరిశుద్ధ గ్రంథములో వ్రాయబడిన సంగతులనుగూర్చి ఆలోచించడం లేదు. మీరందరూ దాదాపుగా ప్రతిదినము ఏదో ఒక వార్తా పత్రిక చదువుతూ వుంటారు. కొందరు స్థానిక వార్తలపైనా, కొందరు సినిమా వార్తలపైనా, కొందరు షేర్ మార్కెట్ వార్తలపైనా, కొందరు బూలియన్ మార్కెట్‌పైనా దృష్టి వుంచుతారు. అయితే గ్రీసు దేశాన్ని గూర్చిన వార్త గత కొద్ది రోజులుగా ప్రముఖంగా కనబడుతున్నవి. అదేమిటంటే గ్రీసు ఆర్థిక పరిస్థితులు బాగలేవు. ప్రజలు విసిగిపోయారు. ఆ దేశ ప్రధాని అలెక్సిస్ సిప్రాస్‌కు కూడా ఇబ్బందికర పరిస్థితులో వున్నాడు. అయితే ఇప్పటివరకు యూరోజోన్ (యూరోపియిన్ యూనియన్)లో సభ్యత్వం కలిగియున్న గ్రీస్ తన సభ్యత్వాన్ని ఉపసంహరించుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. అది జరిగితే దానియేలు 2:41లో వ్రాయబడిన వాక్యము నెరవేర్పు జరిగిందన్నమాటే. అంటే రాకడలో జరుగవలసిన సూచనలు ఒక్కొక్కటిగా జరుగుతూ మనం రాకడకు సమీపమౌతున్నామన్నమాట.

క్రీస్తునందు ప్రియులారా! రాకడ ఎప్పుడు వచ్చిన మనం సిద్ధపడివుంటే పైకెత్తబడతాము కదా. కనుక నేడే యేసుప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించి సిద్ధపడుదుము గాక.

-ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు

17

– కొడవటికంటి

సైఫను మరణించినది మహాసభ తీర్పువలన కాదు కాని – నజరేయుడైన యేసుకు వ్యతిరేకులైనవారు, ప్రధాన యాజకునికి నెలవైన వారి కోపాగ్నికి బలి అయినాడు. కనుక అతని కొరకు ఇప్పుడు బహిరంగముగా విలపించవచ్చును. అతనిని పరిశుద్ధ పట్టణములోనో, సమాధులలోనో భూస్థాపితం చేస్తారు అనుకొన్నాడు. 'ప్రభువా!' అని పెద్దగా అరచిన సైఫను యొక్క ఆఖరి ప్రార్థన తన చెవులలో ఖంగుమన్నట్లు మరలా వినిపించింది. ఆ కండ్లు తనవైపే చూస్తూ 'వారిమీద ఈ పాపము మోపకుము' అనిన చూపు తన విషయమై ప్రార్థించినట్లుగా కలిగిన భావన, దానిని ప్రక్కకు నెట్టివెయ్యటం తనకు సాధ్యం కావటం లేదు. ఈ నరకములో నుండి తను తప్పించుకోవాలంటే, ఈ నజరేయుని శిష్యులలో ఒక్కరైనను ఈ యెరూషలేములో నివసించకుండా చెయ్యాలి అనుకొంటూ ప్రధాన యాజకుని ఇంటి ప్రాంగణంలో ప్రవేశించాడు.

కయపగారు సౌలును చూడగానే సాదరంగా ఆహ్వానించి, ప్రక్కనే ఆసనంమీద కూర్చోబెట్టాడు. ఇప్పుడు కయపగారి మొఖం విశ్రాంతిగా ఉంది. కాని సౌలు యొక్క హృదయం అవిశ్రాంతముగా, గజిబిజిగా ఉంది. తను దివారాత్రములు విశ్రాంతి ఎరుగకుండా చెయ్యగలిగిన కార్యము కొరకు ఎదురు చూస్తున్నాడు.

"మీరెందుకు ఆ స్థలము వద్దకు వెళ్ళారు?" అని అడిగాడు కయపగారు. "ఈ మరణముతో మహాసభకు ఏమీ సంబంధం లేదు. అసలు సభకు ఏ విధమైన మరణశిక్ష కూడ విధించటానికి అధికారం లేదు. ఈ మరణం –హత్య క్రిందకి వస్తుంది. కనుక సభ్యులు ఎవరైన అక్కడ ఉంటే, పిలాతు గూఢాచారులు సిసారియ పట్టణంలో ఫిర్యాదు చేస్తారు" అన్నాడు.

"చెట్టు పెద్దది కాకముందే, అంకురార్పణ జరిగిన సంఘటన చల్లారక ముందే, నజరేయుని నామము ఈ పట్టణంలో ఎవరు పలుకకుండా చెయ్యటానికి నాకు కొంతమంది బంట్రౌతులను, కొందరు పెద్దలను తోడు ఇవ్వండి" అంటుంటే, ఎంతో కాలంగా భూమిలో బంధింపబడిన జలధార ఒక్కసారిగా పెల్లుబికినట్లుగా అనిపించింది.

"ఈ విధమైన సమర్పణ కొరకై – స్వార్థరహితమైన సేవకై సమర్పించుకొనిన నీవంటి యువకులు నేడు దేవుని సమాజంలో లేకుండుట వలనే ఈ నజరేయుని నామము ఇంతగా విస్తరించింది. సౌలు! నా హృదయంలోనే కాదు, యావత్తు యూదా మత ప్రవిష్టులలో నీవు తలమానికముగా వెలుగుతావు. రేపు ఉదయం మీరు ఇక్కడికి రండి. నేను అన్నాగారితో మాట్లాడి మీకు కావలసిన ఏర్పాట్లు అన్నీ సిద్ధము చేస్తాను" అన్నాడు.

సైఫను హత్య జరిగి నెలరోజులైనా గమలియేలు గారి మనస్సు ఇంకా స్థిమిత పడలేదు. ఇది ఖచ్చితంగా హత్యే! – సభకి ఏమి సంబంధం లేదు అని తనలోతాను సంభాళించుకోబోయాడు. కాని తన ప్రియమైన శిష్యుడు దీనికి – ఈ హత్యకు మూలకారకుడైనట్లు, పట్టణంలో జరుగుతున్న ఈ దారుణ మారణకాండకు సౌలు నాయకుడని, తనకు వచ్చిన వార్తలు ఆయన హృదయాన్ని అతలాకుతలం చేశాయి.

సౌలు చిన్నతనం నుండి తనకు ప్రియమైన శిష్యునిగా ఎంచబడినాడు. ఇన్ని సంవత్సరాలుగా అతనిలో క్రౌర్యము గాని, హింసగాని చూడలేదు. సున్నితమైన హృదయం గలవానిగా, దయ కలిగిన వ్యక్తిగా అందరివలన ప్రశంసించబడిన వ్యక్తి – సౌలు. నేడు అతనికి శాంతి లేకుండా, అతని ద్వారా అనేకులను అశాంతికి గురయ్యేటట్లుగా ప్రవర్తిస్తున్నాడు

ఇవన్నీ దేవుని కార్యములా? మతోన్మాదమా?... ఇంత కాలం యూదులను అన్యులు హింసిస్తే, ఈనాడు యూదులే యూదులను నశింపచేస్తున్నారు. నజరేయుడైన యేసు శిష్యులందరు నూటికి నూరు పాళ్ళు యూదులే! అన్యులు యేసును స్వీకరించతలచినా ముందు యూదామతం స్వీకరించవలసినదే! అటువంటప్పుడు వారిని క్రూరముగా హింసించి చెరసాలలో వేయించటం, దేవుని కార్యముకాదు.

ఉదయం పదిగంటలు దాటినా తన గదిలోనుండి బయటకు రాలేదు. తన కోసం ఎంతోమంది బయట వేచి

వున్నారని తనకు తెలుసు. కాని నేటి రోజుల్లో మనుష్యుల ఎదుటికి రావటానికి సిగ్గుపడవలసి వచ్చింది. ఎవరు తనతో మాట్లాడ వచ్చినా సౌలు సంగతే మాట్లాడుతున్నారు.

లెహోయేలు గారు వచ్చి చాలాసేపు అయిందన్న కబురుతో తేరుకొని లోపలికి తీసుకొని రమ్మన్నాడు. లెహోయేలుకు నలభై సంవత్సరాలు ఉంటాయి. సౌమ్యుడు, నిదానస్తుడు. వంగి నమస్కారం చేస్తూ ఉంటే ప్రక్కకు రమ్మని గమలియేలు సంజ్ఞ చేశాడు. అతడు ప్రక్కన కూర్చున్నాడు.

"చెప్పండి" అన్నాడు గమలియేలుగారు.

ఇప్పుడు సౌలును గురించిన వార్త ఏదో భయంకరమైనదే చెప్పబోతున్నట్లు గ్రహించాడు.

"సౌలు గొప్ప సమూహముతో దమస్కు దండయాత్రకు బయలుదేరాడు" అన్నాడు లెహోయేలు.

"దండయాత్ర అంటున్నారేంటి?" అన్నాడు గమలియేలు.

"కొంతమంది బంట్రౌతులు, కొంతమంది సన్హెడ్రిన్ సభ్యులతో కలసి దమస్కు పట్టణం వరకు – మధ్యలో ఉన్న గ్రామాలు పట్టణాలలో ఉండే యేసు శిష్యులను బంధించి, విచారణకు యెరూషలేమునకు తీసుకొని రావటానికి ప్రధాన యాజకుని వద్ద సభ పత్రాలు తీసుకొన్నాడు" అన్నాడు.

"యెరూషలేము పట్టణంతో ముగిస్తుంది అనుకొనిన ఈ వధ ఇతర గ్రామాలకు కూడ ప్రాకుతుంది" అన్నాడు గమలియేలు.

"స్తెఫను హత్యచేయబడిన మొదటి వారంలోనే సగం మందికి పైగా శిష్యులు కుప్ర, సమరియ, ఫినికే, అంతియొకయ వరుక చెదరిపోయారని, వారు యేసుని గూర్చి ప్రకటించి, అనేకులను ఆ ప్రాంతాలలో శిష్యులుగా మార్చారని, అందువల్ల ఆ ప్రాంతంలో కూడ తన కార్యక్రమాలు, ప్రారంభించటానికి సన్హెడ్రిన్ సభయొక్క ఆమోద పత్రాలు తీసుకొన్నాడు. ఈ రోజు బయలుదేరి వెళ్తున్నారు." లెహోయేలు కొంచెం దీనంగా, కొంచెం కోపంగా, కొంత నిందగా చెప్తున్నట్లు మాట్లాడాడు. మరలా తను మాట్లాడుతూ "అమాయకులను తప్ప, యేసు శిష్యులలో గొప్ప వారిని, పలుకుబడి కలిగిన వారిని ఏమి చెయ్యలేదు. శిష్యులలో ముఖ్యుడైన పేతురుగారు యెరూషలేము వీధులలో దేవాలయానికి వెళ్ళేటప్పుడు, యేసు శిష్యులేకాక అన్యులుకూడ తమ రోగులను మంచాల మీద, పరుపుల మీద వీధులలో ఉంచుతారు. పేతురుగారు నడిచి వెళ్ళేటప్పుడు ఆయన నీడ వారిమీద పడినప్పుడు వారికి స్వస్థత కలుగుతుంది. అటువంటి వారికి సౌలు కాదు గదా, మరి ఎవరైనను హాని తలపెట్టిన యెడల జనసమూహం క్షమించదు. అందువలన అపోస్తలులు అనబడే వారు పట్టణం విడచి వెళ్ళలేదు" అన్నాడు.

గమలియేలుగారి ముఖం కందగడ్డలా అయింది. దుఃఖం పొర్లుకొని వచ్చింది. ఏ చెట్టునైతే తను ప్రేమగా, అనేకులకు నీడనిచ్చే చెట్టుగా పెంచాడో – ఆ చెట్టుకు తన కండ్ల ముందే చీడ పట్టి, క్షీణించటం మొదలు పెట్టినట్లుగా దీనికి తన అశక్తత బయలు పడుతుంది.

"ఈ కార్యము దేవుని వలనైనది కాదు. ఇది ముమ్మాటికి మనుష్యుల వలనైనదే! కనుక ఇది వ్యర్థమవుతుంది. అంత వరకు ఈ క్షోభను ఓర్చుకొనే శక్తి దేవుడు మనకు అనుగ్రహించుగాక" అని బయటకు వెళ్ళటానికి బయలు దేరాడు లెహోయేలు.

తల మీద ఇనుప పళ్ళెంలాంటి కవచం పెట్టుకొని, నడుముకు 16 అంగుళాల కత్తి కట్టుకొని తను ప్రయాణం చెయ్యబోయే ఒంటె దగ్గరగా వచ్చి దాని ముఖం పైకెత్తి కండ్లలోకి చూసాడు. "చాలా దూరం ప్రయాణం. ఇద్దరం కలసి చెయ్యాలి. ఎండ, ఇసుక, రెండూ కలసి తయారుచేసే వడగాలి – ఎన్ని మజిలీలు చెయ్యాలి?" అన్నాడు సౌలు.

తనను వెంబడిస్తున్న బంట్రౌతులు అందరు నజరేయునికి విరోధులే! తనను ప్రేమించి గౌరవించేవారు, ఎంత కష్టానైనా భరించ ఇష్టము కలిగినవారు, కొన్ని ఒంటెల మీద రెండు నెలలకు సరిపోయే ఆహారం – సైన్యమంతటికే కాక తను బంధించబోయే వారికి కూడ ఆహారపు ఏర్పాట్లు సిద్ధం చేసారు. దాదాపు 200 మైళ్ళు. కనీసం 12 రోజులుగా ప్రయాణం. ఈ సుదూర ప్రయాణానికి ఎడారి ఓడ మాత్రమే పనికి వస్తుంది. ఒంటె వంటి ఓర్పు ప్రపంచంలో ఏ మానవునికి ఉండినా ఈనాటి సమాజంలో ఈ అసహన వాతావరణం ఉండేది కాదు, సౌలు ఆలోచిస్తు రిఫత్ కోసం ఎదురు చూస్తున్నాడు.

రిఫత్ తన వయస్సువాడే! గమలియేలుగారి వద్ద చదువుకోక పోయినా, ఇస్మాయేలుగారి యొద్ద చదువుకొన్నాడు.

అతని ఇల్లు బెత్లేహేము రహదారిలో అంటే హెబ్రోను వెళ్ళేబాటకి పడమర వైపుగా యెరూషలేము పొలిమేరల్లో ఉంటుంది. అంత ఆస్థిపరుడు కాకపోయినా బీదవాడుకాదు. ఆస్తిపరుడుగా కనబడటానికి ప్రయత్నిస్తుంటాడు. అందువల్ల అప్పుల్లో ఉన్నాడు. తన ఉనికి, గుర్తింపు కోసం ఏమైనా చేస్తాడు. ఇప్పుడు ఈ నజరేయుని మనుష్యుల ఏరివేత కార్యక్రమంలో కూడ అదే ఉద్దేశ్యము. తను యెహోవా దేవుని కొరకు ఈ త్యాగము చేస్తున్నాను అని అంటాడు.

దమస్కు ప్రయాణం మొదలుపెట్టటానికి ముందే అక్కడ సమాజ మందిరముల వారికి ఈ వర్తమానము అందింది.

నజరేయుని శిష్యులను హింసించటం, బంధించటం, చెరసాలలో వేయించటమేకాక, వారిని చంపినప్పుడు తనలో వారిమీద పంతం, మరి ఎక్కువగా ద్వేషం పెరిగినవే కాని తన క్రియలు తనకు మనశ్శాంతిని ఏమాత్రము కలిగించలేదు.

ఉదయాన్నే ప్రయాణానికి సిద్ధమవుతూ – అద్దంలో తన ముఖం చూచుకొన్నప్పుడు తనకే ఆశ్చర్యం వేసింది. చాలా సంవత్సరముల క్రితం చూసిన ముఖంలాగా లేదు. ఎడారిలో అనేక దినములు గడిపిన వాని ముఖంలాగా ఉంది. రీఫత్ వస్తున్న శబ్దం–అటు తిరిగి చూస్తే పెద్ద అంగలు వేస్తూ వస్తున్న రీఫత్, దగ్గరికి వచ్చి సౌలు భుజం మీద కలుపుగోలుగా చేయివేశాడు.

"మనం అక్కడికి వస్తున్నామని దమస్కు సమాజమంది రాల వారికి కబురు అందించి అన్నాడు. గమలియేలు గారికి కనబడవా?" అని అడిగాడు. సౌలు పలుకలేదు.

"దమస్కు వారికి మన ప్రయాణం గురించి ఎలా తెలుస్తుంది?" అని అడిగాడు సౌలు.

"మీ స్నేహితుడు యూదా దమస్కులోని, తిన్ననిది అనబడే వీధిలో నివసిస్తున్నారు కదా! ఆయన దగ్గరనుండి వచ్చిన ఒక వ్యక్తి నన్ను ఉదయం కలిసాడు. దమస్కులోని నజరేయుని శిష్యులందరు మీ గురించి దేవుని ప్రార్థన చేస్తున్నారు" అన్నాడు.

సౌలు ఒంటెల మీద కూలీలు బిగిస్తున్న ఆహారపు సంచులను చూస్తూ వింటున్నాడు. ఒక బంట్రౌతును పిలచి, అంజూరపు అడలు ఇంకా కొన్ని తీసుకొని రమ్మన్నాడు. బంట్రౌతులందరి నడుముల నుండి వ్రేలాడుతున్న కత్తులు చూచి, ఈ నజరేయుని శిష్యుల వ్యవహారములో ఈ కత్తులతో పని ఉండదు అనుకున్నాడు సౌలు.

"ఔను – అక్కడ సమాజ మందిరములు ఎన్ని ఉన్నవి?" అన్నాడు సౌలు రీఫత్‌తో.

"ఇప్పుడు అంతా కలసి ఒకటే సమాజమందిరము. ఇక్కడ గమలియేలువలె, దమస్కులో కూడ ఒక రబ్బీ ఉన్నాడు. ఆయన పేరు అననీయ. ఆయన దమస్కులో యూదా మత ప్రవిష్టుడు. ధర్మశాస్త్రానుసారంగా భక్తి పరుడు. ఆయనను కలిస్తే మంచిది" అన్నాడు రీఫత్.

అంతలో కయపగారు వస్తుంటే బంట్రౌతులందరూ వరుసగా నిలబడ్డారు. కయపగారు సంతోషంగా ఉన్నారు.

సౌలు దగ్గరకు వచ్చి–సౌలు ప్రక్కన నిలబడినప్పుడు ఇద్దరు ఒకే ఎత్తులో కనబడ్డారు. అయితే కయపగారికి పెద్దపొట్ట ఉండి తలమీద వెంట్రుకలు చిక్కగా ఉంటే, సౌలుకు ఇప్పుడిప్పుడే తయారవుతున్న బట్టతల లక్షణాలు కనబడుతున్నాయి.

సౌలు ముక్కు గద్దముక్కు, పైన కనుబొమ్మలు చిక్కగా గుబురుగా రెండు కనుబొమ్మలు ఒకదానిని ఒకటి కలసుకొన్నట్లుగా ఉంటాయి. 'ఎంత ఎండలో తిరిగినా మాకేమి నీడ తక్కువ కాదు' అన్నట్లు కండ్లు చూస్తుంటాయి. కాని నిజానికి ఎక్కువ నిద్రకాచినా, ఎక్కువ తిరిగినా ఆ కండ్లు పడే బాధ సౌలుకు తప్ప ఎవరికి తెలుసు?

"సమరయ మీదుగానా? యెరికో మీదుగానా?" అని అడిగాడు.

సౌలు చిన్నగా నవ్వి, వెంటనే ముఖం గంభీరంగా పెట్టి "ధైర్యకార్యము, పాపం అంటుకోదు. దగ్గర దారినే వెళ్ళుదామని అనుకొంటున్నాను. ఈరాత్రి 'షిలోహు'లో గడిపి తర్వాత షెకము, మగ్దలా, కపెర్నహోము... కపెర్నహోము చేరిన తర్వాత, తర్వాత ఏర్పాట్లు విషయం ఆలోచించుకోవచ్చును" అంటూ – 'మీరు ఒంటెలు ఎక్కండి' అన్నట్లుగా అందరి వైపు చూస్తు కయపగారి దగ్గర సెలవు కొరకు తలవంచాడు.

కయపగారు చేయి సౌలు తలమీదుగా ఉంచి "భూమ్యాకాశ ములకు సృష్టికర్తయైన దేవుడు ఇది మొదలు మీకు తోడై యుండును గాక" అన్నాడు. మిగిలిన వారందరు "ఆమేన్!" అంటూ అందరు తమ తమ ఒంటెలమీద కూర్చున్నారు.

**(సశేషం)**

సీరియల్

# పోల్కికుష్కా

16

## (లియో టాల్‌స్టాయ్)

"ఏ రకమైన పని?" అన్నది.

అతను ఆలోచిస్తూ మాట్లాడలేదు.

"ఆమె నన్ను పట్టణానికి వెళ్ళి ఓ పెద్ద ఆసామి దగ్గరనుండి ఓ పెద్ద మొత్తాన్ని తీసుకొని రమ్మన్నది" అన్నాడు.

"నిన్ను డబ్బు తెమ్మన్నదా?" అన్నది ఆశ్చర్యపోయి.

"ఎవరేమన్నా పోల్కీ, నీమీద నాకు నమ్మకమున్నది. కనుక నువ్వు వెళ్ళి డబ్బులు తీసుకొనిరా! అని అన్నది" అని పెద్దగా ప్రక్క పోర్షన్‌లో నివశించేవారికి వినబడేటట్లు అరచి చెప్పాడు.

"ఎంతడబ్బు నువ్వు తీసుకొని రాబోతున్నావు?" అన్నది అతని భార్య.

"పదిహేనువందల రూబుల్సు" అన్నాడు.

"నువ్వెప్పుడు బయలుదేరుతున్నావు?" అన్నది.

"రేపు ఉదయం, కావాలంటే నా గుఱ్ఱపు బండి తీసుకొని వెళ్ళు. నా ఆఫీసుకు నువ్వు రా, అక్కడ నీ ప్రయాణం కొరకు ప్రార్థిస్తాను అన్నది అమ్మగారు" అన్నాడు పోల్కీ

"నీకు మహిమ కలుగునుగాక దేవా!" అన్నది అకులీనా. సిలువగుర్తు వేస్తూ "దేవుడు నిన్ను తప్పక దీవిస్తాడు పోల్కీ" అని "దయచేసి ఆ సిలువను ముద్దు పెట్టుకొని, ఒక్కచుక్క ఓడ్కా ముట్టుకోనని దేవుని మీద ప్రమాణం చెయ్యి" అన్నది.

"అంత డబ్బు నా దగ్గర ఉంచుకొని నేను ఓడ్కా తాగుతానని అనుకొంటున్నావా?" అన్నాడు.

ఆ రాత్రంతా వారు హాయిగా నిద్రపోయారు. కోర్టులో పనిచేసే వారంతా పోల్కీ ఇంటికి వస్తున్నారు. ఒకరు పట్నం నుండి రొట్టెలు తెమ్మని మరొకరు టీపొడి తెమ్మని అలా ఏవేవో చెప్తున్నారు. ప్రక్కింటి ఆమెను "ఓ టోపి ఇవ్వండి మళ్ళీ వచ్చి ఇస్తాను" అంటే ఆమె ఇవ్వనన్నది. అందువలన పోల్కీ పాత టోపీని చినిగిన చోటెల్లా కుట్టడం మొదలు పెట్టింది అకులీనా. ఆఫీసు వద్దకు వెళ్ళి గుఱ్ఱం బండిసిద్ధం చేసి యజమానురాలిని చూశాడు. ఆమె అడ్రసు వ్రాసిన ఓ సీలు వేసిన కవరు పోల్కీకి ఇచ్చింది. దానిని తన కోటు ముందు ప్రక్కన బన్నీను క్రింద దాచి పిన్ను పెట్టాడు.

బండి మీద ఇంటికి వచ్చి భార్యా పిల్లలతో చెప్పి బయలు దేరుతుంటే పోల్కీ చిన్నపిల్లలు బండి మీద కొంచెం దూరం తీసుకెళ్ళమని ఏడ్చారు. పక్కింటి పిల్లవాడ్ని, తన ఇద్దరు పిల్లల్ని బండిమీద కొంతదూరం తీసుకెళ్ళి వాళ్ళను దించి పోల్కీ ప్రయాణమయ్యాడు.

బయట వాతావరణం చల్లగా ఉన్నది. పోల్కీ ఆలోచిస్తున్నాడు. నన్ను అందరు దొంగ, మోసగాడు అన్నాడు. కాని ఈనాడు నా యజమానురాలు నన్ను ప్రేమించి గౌరవించి ఇంత బాధ్యత గల పని అప్పగించింది. నేను తిరిగివచ్చిన తర్వాత ఆమె చాలా డబ్బు బహుమానం ఇస్తుంది. దానితో గొప్ప వ్యాపారం చేసి బాగా బ్రతకాలి అనుకున్నాడు. దారిలో ఓసారా కొట్టు కనబడింది. బండి ఆపి గుఱ్ఱముకు కొంత మేతవేసి అది తినిన తర్వాత మళ్ళీ బయలుదేరి తను వెళ్ళవలసిన ఇంటికి వచ్చాడు. అక్కడ పనివారితో కలిసి భోంచేసి ఉదయం వ్యాపారిని కలిశాడు.

వ్యాపారి యజమానురాలి ఉత్తరం చదివి డబ్బులు ఓ కవరులో పెట్టి ఇచ్చాడు. ఆ కవరును తన రొమ్మున పెట్టుకోకుండా తన టోపీలోపల ఉన్న అరలో పెట్టి తల మీద పెట్టుకొని బయలుదేరాడు. దారిలో మాటిమాటికి టోపీలోని డబ్బు జాగ్రత్తగా ఉన్నదని చూసుకుంటున్నాడు. రాత్రిపూట ప్రయాణం చెయ్యకూడదని ఇంటివద్దనే పండుకున్నాడు. మరునాడు ఉదయాన్నే లేచి బండి సిద్ధం చేసి గుఱ్ఱానికి కొంచెం మేతపెట్టి తన టోపీలో అడుగుభాగాన

ఉన్న డబ్బు కవరును చూసి సంతోషపడ్డాడు. కొంతదూరం ప్రయాణం అయిన తర్వాత తలమీద టోపీ తీసి డబ్బున్న కవరు చూసి మరలా తలమీద పెట్టుకొని బయలుదేరాడు.

రాత్రి సరిగా నిద్రపోలేదు. అందువలన నిద్ర వస్తుంది. బండిని రోడ్డు క్రిందిభాగంలో ఉంచి ప్రయాణం సాగించాడు. టోపీని ముఖం మీదకు లాక్కుని దాని తాడును పండ్ల మధ్య పట్టుకొని నిద్రపోయాడు. నిద్ర మెళకువ వచ్చినప్పుడు టోపీని తీసి కవరు చూసి మరలా తలమీద పెట్టుకొని గుఱ్ఱాన్ని అదిలించాడు.

దారిలో చాలా అంగళ్ళు చూశాడు. కాని తన మనస్సును అదుపులో పెట్టుకొని సారాయి అంగడి చూచినప్పుడెల్లా గుఱ్ఱాన్ని కొంచెం అదిలించాడు. గుఱ్ఱాన్ని అదిలించినప్పు డల్లా చేతిని టోపీ మీదకు పోనిచ్చి తడిమాడు. అలా తడిమినప్పుడల్లా కవరు చేతికి తగులుతూనే ఉంది. ఇంటికి వచ్చిన తర్వాత సంతోషంగా బండి దిగి కోటు తీయాలని టోపీని తీశాడు. టోపీ తేలికగా ఉంది. కవరు లేదు. గబగబ బండి అంతా వెతికాడు. బాటుష్కా "నాకు ఏమైంది? డబ్బు ఏమైంది?" అని పెద్దగా అరిచాడు. అలా అరచి ప్రక్కింటి వాళ్ళు విన్నారేమో అని అటుచూచి బండిని వెనక్కు త్రిప్పి టోపీని ముఖం మీదకు లాక్కుని ఎవరు చూడడం లేదని నిశ్చయించుకొని డబ్బుని వెదుక్కుంటూ వెనక్కు వెళ్ళాడు.

అతని భార్య అతని అరుపు విని బయటకు వచ్చింది. కాని పోల్కీ కనిపించలేదు. అతని యజమానురాలు పోల్కీ కొరకు కబురుచేసింది. పిల్లలైతే తండ్రి పట్నం నుండి ఏమి తెస్తారా? అని ఎదురుచూస్తున్నారు. అతని భార్య ఆ రాత్రంతా భర్త కోసం ఎదురుచూస్తోంది. మధ్యాహ్నం గుడ్డలు ఉతకడం ప్రారంభించింది. "నాన్న! నాన్న! అడుగో!" అని పిల్లలు అరుస్తున్నారు. పోల్కీ ఇంట్లోకి వచ్చి తన పడకమీద కూర్చున్నాడు. ముఖం తెల్లగా పాలిపోయింది. అతను ఆలోచిస్తున్నాడు.

"పోల్కీ! ఏమయింది నీకు?" అని అన్నది.

అతను పెద్దగా నవ్వాడు. "డబ్బు అమ్మగారికి ఇచ్చాను" అన్నాడు.

ఎదురుగా ఉయ్యాలలో బిడ్డ పండుకొని ఉన్నది. ఆ ఉయ్యాలకు ఒక చేంతాడు కట్టబడి ఉన్నది. పోల్కీ ఆ చేంతాడు చాలాసేపు చూశాడు. అకులీనా బయటకు వెళ్ళింది. వెళ్తూ "ఏంటి అలా ఉన్నావు?" అన్నది.

"రాత్రంగా నిద్రపోలేదు" అన్నాడు.

యజమానురాలు పంపిన అమ్మాయి వాకిట్లో నిలుచుని "పోల్కీ! నిన్ను అమ్మగారు రమ్మన్నారు" అని అరిచింది.

"ఇదిగో వస్తున్నాను నువ్వు పో!" అన్నాడు. అతను నిదానంగా లేచాడు. ఎవరూ చూడడం లేదని అటు ఇటు చూసి ఉయ్యాలకి ఉన్న తాడు విప్పదీసి ఇంటివెనుక ఉన్న నిచ్చెన మీదుగా తాడు తీసుకొని వెళ్ళాడు.

పనిపిల్ల మళ్ళీ యజమానురాలి దగ్గర నుండి వచ్చి పెద్దగా అరిచింది. పోల్కీ తాడుకు ఉరివేసుకొని వేలాడు తున్నాడు.

ఆ సాయంకాలం పొలం నుండి ఇంటికి వస్తున్న రైతు కూలీలకు ఒక కవరు దొరికింది. దానిమీద యజమానురాలి అడ్రసు ఉంది. దానిని తీసుకొని వచ్చి యజమానురాలికి ఇచ్చారు.

**పోల్కీ ఇంటిముందు జనం గుంపులుగా కూడి ఉన్నారు.**

## ఒక మనిషికి ఎంత నేల కావలెను?

**ఓ పల్లెటూరులో** నివశిస్తున్న చెల్లెలి కాపురం చూడ డానికి పట్నం నుండి అక్క వచ్చింది. పట్నంలో ఆమె పెని మిటి వ్యాపారం చేస్తున్నాడు. చిన్నామె పెనిమిటి – వ్యవ సాయకుడు. మధ్యాహ్నం భోజనాలు అయిన తర్వాత వారిద్దరు కూర్చుని మాట్లడుకోసాగారు. పట్నం ఆమె, చెల్లెలిని చూసి – "ఇక్కడ ఏమీ బాగోలేదు. పట్నంలో సాయంకాలం షికారుగా క్లబ్బుకి వెళ్ళవచ్చు. ఆకలైతే హోటల్‌నుండి ఏమైనా తెప్పించుకోవచ్చు. ఎంతో శుభ్రంగా వీధులు ఉంటాయి" అని చెప్పింది.

అందుకు చెల్లెలు ఒప్పుకోలేదు. "అక్కడ ఇరుకు ఇండ్లలో నివశించాలి. ఎవరి జీవితాలు వారివే. ఇరుగు పొరుగు

ఉండదు. ఇక్కడ ఎంతో ఆరోగ్యము ఉంటుంది. పట్నంలో డబ్బు ఉన్నవాళ్ళు ఎంతో డబ్బుతో ఉంటారు. రేపు బికారు లౌతారు. తక్కువ ఎక్కువలనేవి కవలపిల్లలు. ఒకరోజు తక్కువతో ఒకరోజు ఎక్కువతో జీవించడం కంటే దిగులు చింత లేకుండా పల్లెవాసమే మేలు" అన్నది.

"అవును! ఇక్కడ పందులతో, ఆవు, దూడలతో నివశించడం నీకు అలవాటయిందిలే. ఈ మురికి కూపమే నీకు స్వర్గంలా అనిపిస్తుంది" అన్నది అక్క.

"నిజమే! అక్కడ పట్నంలో ఉన్న మగవారు చీట్లపేక, త్రాగుడు తొందరగా అలవాటు పడిపోతారు. ఇక్కడ పల్లెలో అలా జరుగదు" అన్నది చెల్లెలు.

అక్కాచెల్లెళ్ళ సంభాషణ అంతా చెట్టుక్రింద పండుకొని వింటున్నాడు ఇంటి యజమాని. అతని మనస్సు చివుక్కు మన్నది.

"నిజమే కదా! నాకు కొంచెం పొలం ఉండి బీదవాడినని కదా మా వదిన అలా అన్నది. అదే నాకు చాలా పొలం ఉండి గొప్పవాడినైతే ఆమె అలా మాట్లాడదు కదా" అనుకొన్నాడు. "ఎలాగైనా ఇంకా పొలం కొనాలి" అనుకొన్నాడు.

ఇంటి యజమాని పేరు పామ్. అతని హృదయాలోచనల ద్వారా వచ్చిన మాటలు సాతానుడు ఆ మంచము మీద అతని ప్రక్కనే కూర్చుని విన్నాడు. చాలా సంతోషించాడు. అలాగైతే నేను వీడికి చాలా పొలం వచ్చేటట్లు చేసి ఇతడ్ని నా గుప్పెట్లో పెట్టుకుంటాను అని సంతోషించాడు. ఆ గ్రామానికి చేరువలో ఓ ధనవంతురాలికి మూడువందల ఎకరాల వ్యవసాయం ఉన్నది. ఆమె తన చుట్టుప్రక్కల నివశించే గ్రామవాసులతో సమాధానముగా స్నేహముగా జీవించింది. అయితే ఆమె పొలం చూడడానికి ఓ మాజీ సైనికోద్యోగిని నియమించిన తర్వాత ఆమె ఇరుగుపొరుగు వారికి తిప్పలు వచ్చాయి. పశువులు ఆమె పొలంలో పడినప్పుడు ఈ మాజీ సైనికుడు వారికి జరిమానా విధించేవాడు. పామ్ గుఱ్ఱం ఓ రోజు పొలంలోకి వెళ్ళి మేసినందున అతను చాలా డబ్బు చెల్లించవలసి వచ్చింది. అయినా అతను ఇంటికి వెళ్ళి అందరిమీద తన కోపం ప్రదర్శించాడు. తన పశువులను ధనవంతురాలి పొలము లోనికి పోకుండా చెయ్యడానికి రాత్రింబవళ్ళు కాపలా ఉండవలసి వచ్చింది. చలికాలం వచ్చింది. ఆ ధనవంతురాలు తన పొలం అంతా అమ్మివేస్తుంది అనే పుకారు మొదలైంది. చుట్టుప్రక్కల పల్లెవారు చాలా ఆందోళన పడ్డారు. ఆ పొలాన్ని ఓ సత్రం యజమాని కొనబోతున్నాడని తెలిసి పల్లెవాసులంతా ఓ చోట చేరి ఆందోళనపడ్డారు. వారంతా ఆ యజమానురాలి దగ్గరకు వెళ్ళి "ఆ పొలమును సత్రం యజమానికి అమ్మకండి. మేమంతా కూడుకొని ఏదో ఓ ధరకి కొనుక్కుంటాము" అన్నారు. ఆమె ఒప్పుకున్నది. గ్రామవాసులంతా రెండుసార్లు కూడుకొని ఆ పొలం ఎలా కొనాలి? అని తర్జన భర్జన పడ్డారు. సాతాను వారి మధ్యలో చేరి ఏ విషయం చివరికి చేరనివ్వలేదు. కనుక ఎవరికి వారే వారు కొనగలిగినంత కొనాలనుకున్నారు. అందుకు కూడా యజమానురాలు ఒప్పుకున్నది.

తన పొరుగున నివశించే వ్యక్తి ఆ పొలములో యాభై ఎకరాలకు సగం డబ్బు ఇచ్చి సగం డబ్బు బాకీ క్రింద పెట్టి కొనాలనుకున్నాడని పామ్ విన్నాడు. సాతాను అతనిలో కుళ్ళు పుట్టించాడు. పామ్ తన భార్యతో "ఆ మిలటరీవాడు మనకు జుల్మానాలు విధించి జీవితాన్ని దుర్భరము చేశాడు. కనుక మనం కనీసం ఇరవై ఎకరాలైనా కొనుక్కోవాలి" అన్నాడు. అప్పుడు దంపతులిద్దరు ఏకమై వారి పశువులను అమ్మారు. వారి కుమారులలో ఒకనిని ఓ ఆసామి దగ్గర సంవత్సరం కూలీగా పెట్టి అడ్వాన్సుగా డబ్బు తీసుకున్నారు. పామ్ బావమరిది దగ్గర పెద్ద మొత్తం అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బు తీసుకొని యజమానురాలి దగ్గరికి వెళ్ళి నలభై ఎకరాలు కొన్నాడు. అందుకుగాను సగం డబ్బు చెల్లించి మిగిలినది అప్పుగా నోటు వ్రాసి పట్నం వెళ్ళి పొలం రిజిస్టరు చేసుకున్నాడు.

**(సశేషం)**

చిన్నపిల్లల పేజి




# అందమైన తోట నీ జీవితం

ఒక స్థలం అంతా చెత్త, రాళ్ళు, పగిలిన గాజు పెంకులు, గడ్డి, పిచ్చి చెట్లు ఉన్నాయి. అక్కడ ఆ చెత్తే కాకుండా ఇంకా అక్కడ ఉన్న జనం కూడా వాళ్ళ ఇళ్ళలో చెత్త తీసుకొని ఆ స్థలంలోనే వేస్తారు. ఇంకా చెప్పాలంటే ఆ స్థలంలో ఒక ఇల్లు కూడా ఉంది. ఇంటి కిటికిలు ఎప్పటి నుంచో విరిగి పగిలిపోయి ఉన్నాయి. చాలాకాలం నుండి ఆ ఇంటిలో ఎలుకులు, పురుగులు, పాములు ఉంటున్నట్లుగా అందరి ఉద్దేశం. ఆ ఇల్లు చూడటానికి చాలా దరిద్రంగా ఉంది. ఆ స్థలాన్ని కాని ఇంటిని కాని బాగుచేయాలంటే బుల్‌డోజర్ కావలసిందే.

ఒకరోజు ఉదయము ఒక తోటమాలి ఆ పాడుబడిన ఇంటి మీదగా వెళ్ళాడు. అక్కడ ఉన్న చెట్లన్ని ఇప్పుడు నడుము ఎత్తుకు వచ్చాయి. అలాగే అక్కడ ఈగలు, పురుగుల గోల కూడా ఎక్కువైంది. ఎప్పటి కంటే ఇప్పుడు ఇంకా ఆ ఇల్లు దిగులుగా కనిపిస్తుంది. ఆ తోటమాలి అటువైపుగా వెళ్ళుతు ఒకసారిగా ఆగిపోయి ఆ స్థలం బయట అటు ఇటు తిరగటం మొదలుపెట్టాడు. ఆ గ్రామంలో ఉండే కొంతమంది జనం తోటమాలి అక్కడ పరిస్థితంతా రాసుకొని అక్కడ నుండి తొందరగా వెళ్ళిపోవటం చూశారు.

ఈ విషయం ఊరంతా తెలిసిపోయింది. ఒక తోటమాలి ఆ ఇంటిని పడగొట్టి ఆ స్థలాన్ని శుభ్రం చేయిస్తున్నాడని. ఎవరైన ఎందుకు బాధపడేది ఆ తోటమాలి అంత మంచి పనిచేస్తుంటే ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలంతా ఎవరైన వచ్చి ఏమైన చేయాలి అప్పుడే ఈ ఇల్లు బాగుపడుతుంది. ఈలాంటి పాడుబడిపోయిన ఇల్లు మనదగ్గర ఉండకూడదు అని ఎవరికి వాళ్ళు అనుకున్నారే కాని ఎవరు ఆ ఇంటి గురించి శ్రద్ధ తీసుకోలేదు.

చాలాకాలం తర్వాత ఒక రోజు ఆ తోటమాలి అక్కడ ఉండే ఆ ప్రాంతపు అధికారి దగ్గరకు వెళ్ళాడు. ఆ తోటమాలిని చూచిన అధికారికి అర్థమైంది ఇది ఎలాగైన శుభ్రపరచాలని అడుగుతున్నాడని. అందుకని ముందుగానే తోటమాలితో పోరాడటానికి సిద్ధంగా ఉన్నాడు.

కాని తోటమాలి అధికారి దగ్గరకు నడుచుకుంటు వచ్చి అతను మర్చిపోలేని విషయం చెప్పాడు. అదేమిటంటే నేను అక్కడ 371 బీకోన్ వీధిలో ఉన్న పాడుబడిన ఇల్లు కొనాలి అనుకుంటున్నాను.

ఈ విషయం ఆ ఊర్లో వాళ్ళందరికి తెలిసిపోయింది. ఆ తోటమాలి ఆ స్థలాన్ని కొని బాగుచేయాలనుకుంటున్నాడని.

ఆ అధికారి స్థలానికి సంబంధించిన అన్ని కాగితాలు అలాగే బిల్స్ తీసుకొని చూస్తే బ్యాంక్‌కి చెల్లించాల్సిన బిల్స్ చాలా ఉన్నాయి. అందుకని అది కొనటానికి చాలా ఎక్కువ ఖర్చవుతుంది చెప్పాడు ఆ తోటమాలికి.

అవన్ని నీవు పట్టించుకోమాకు నువ్వు ఆ స్థలం అమ్ముతావా అమ్మవా అని అడిగాడు తోటమాలి. అప్పుడు అధికారి తలగీక్కుంటు ఆ స్థలం అమ్ముతామండి అన్నాడు.

ఆ స్థలం కొనుకున్న తోటమాలి స్థలాన్ని బాగుచేసి చేట్లన్ని తీసేసి అక్కడ అందమైన చెట్లు నాటి ఆ అసహ్యమైన స్థలాన్ని ఎంతో అందంగా మార్చాడు. ఇదంతా ఇంత శుభ్రంగా కావటానికి ఎంతో సమయం తీసికొని కష్టపడి పనిచేస్తేనే సాధ్యమయ్యింది. ఇంతకు ముందు ఆ ఇంటిని చూడటానికి అసహ్యించుకొనే వారు ఇప్పుడు ఆ ఇంటి అందాన్ని చూడటానికి అటువైపుగా వెళుతున్నారు.

ఇంకా అంతేకాకుండా ఆ ఇంటి ముందు ఒక బోర్డ్ పెట్టింది. దాని మీద ఏమి రాసుందంటే “అందమైన తోట” ఇక్కడ తోటపని నేర్పించబడును.

ఈ తోటమాలి చిన్నప్పుడే తోటపని నేర్చుకున్నాడు ఎలా అసహ్యమైన దానిని అందంగా మార్చాలో అతనికి తెలుసు. ఇప్పుడు ఆ స్థలం ఆ ఊరికే అందాన్నిచింది.


ఆ పాడుపడిపోయిన ఇళ్ళలాగే అనేక మంది చెత్తాచెదారం మధ్యలో జీవిస్తున్నారు. వాళ్ళు అందుకే పనికిరాని వారిగా కనిపిస్తారు. అందరూ వాళ్ళని దూరంగా ఉంచుతారు. బైబిల్ ఏమి చెప్తుందంటే మన్నందరి జీవితాలలో మురికి, చెత్తా ఉంటుంది. మురికి చెత్తా అంటే పాపం.

మనందరికి ఒక శుభవార్త దేవుని దృష్టిలో మనందరం సమానం మనందరం విలువైన వారమే. యేసుప్రభువుని చిత్తమేమిటంటే మనమెవరం నశించిపోకూడదని. మనం పాపం దూరం చేసుకోవాలని ఆయనకు ఇష్టం కాని మనం దూరం చేసుకోలేము. మనం యేసుప్రభుని అడగాలి మనల్ని క్షమించమని మన పాపముల నుండి దూరం చేయమని మనం అలాగా చేసినప్పుడు మనకి దేవుడు క్రొత్త జీవితం ఇస్తాడు. మన పాపములను మరిచిపోతాడు. ఆ తోటమాలి లాగా మనం అందరికి ఈ శుభవార్త చాటాలి. మన జీవితంలో జరిగిన పనులను మనం అందరికి చెప్పాలి. అప్పుడు అందరికీ దేవుడు మన జీవితంలో చేసిన క్రియలు తెలుస్తాయి. అప్పుడు వాళ్ళు దేవుని ప్రార్ధించినప్పుడు ఆయన వాళ్ళ జీవితం కూడా అలాగే చేస్తాడు.

దీన్ని గూర్చి ఒకసారి మీరు ఆలోచించండి. మీరు ఇతరులను చూచినప్పుడు వాళ్ళలో మీరు ఏమి చూస్తారు. వాళ్ళ మలినమైన జీవితాన్నా లేక వాళ్ళలో రాబోతున్నా అందమైన తోటనా?

## పాఠకులకు గమనిక

**‘పరిశుద్ధత’** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు. పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. “మీ పత్రిక ఫలానా చోట చూశాము. మీ పత్రిక చాలా బాగుందండీ, మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలుకరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము” అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. అందుకనే గత నెలలో పత్రికతో పాటు “పత్రిక కావాలా? వద్దా?” అనే విషయం పోస్ట్‌కార్డ్ ద్వారా తెలియజేయమని పోస్ట్‌కార్డ్ పంపించాము. అందువలన పోస్ట్‌కార్డ్ తిరిగి మాకు పంపని వాళ్ళందరికీ వరుసక్రమంలో పత్రిక ఆపివేయబడుతుంది. పత్రిక కావలసిన వాళ్ళు ఫోన్‌ద్వారా కాని, పోస్ట్‌కార్డ్ ద్వారా కాని తెలియజేయగలరు. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నిర్వహించగలుగు తున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 150/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయముతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను. **– ఎడిటర్**





# బైబిలు చరిత్ర

సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్

తెలుగు క్రైస్తవ ఆదికవి చౌదరి పురుషోత్తము క్రొత్త నిబంధన అనువాదంలో ఎస్.వార్డ్లా, జాన్ హే అనేవారికి తన సహాయసహకారాల నందించాడు. చౌదరి పురు షోత్తము వ్రాసిన క్రైస్తవగీతాలు తెలుగు క్రైస్తవ లోకానికి ప్రశస్తమైన ఆణిముత్యాలు. ప్రాచీన హెబ్రీ గ్రీకు ప్రతుల ఆధారంగా అనువదించిన తెలుగు బైబిలు సవరణ కార్యక్రమంలో జాన్ హేకు సహాయం చేయడానికి 1865 సంవత్సరంలో బైబిలు సొసైటీ మద్రాస్ ఆక్జిలరీవారు ఒక కమిటీని నియమించారు. జాన్ హే తెలుగు అనువాదానికి సంబంధించిన నియమా వళిని క్రైస్తవ వేదాంత అంత్యప్రత్యయాలను (పదజాలాన్ని) సమీక్షించి వీటిని 1874 సంవత్సరంలో ప్రచురించిన బైబిల్లో ఆదికాండము గ్రంథపీఠికలో చేర్చాడు. ఆ తర్వాత, 1878 సంవత్సరంలో సవరించిన క్రొత్త నిబంధనను ప్రచురించారు. 1882 సంవత్సరంలో బైబిలు సొసైటీవారికి లండన్ మిషనరీ సొసైటీకి మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం హే 'ముఖ్య సవరణాధికారి'గా తన పూర్తి సేవలను బైబిలు సొసైటీకి అందించాడు. 1884 సంవత్సరంలో సవరించిన బైబిలు విడుదల అయ్యింది. దాదాపు ఇరవై అయిదేండ్లు తన శక్తిని సమయాన్ని తెలుగు బైబిలు అనువాదానికి వెచ్చించి అహర్నిశలు శ్రమించి హే 1891 సంవత్సరంలో మరణిం చాడు. ఆ తర్వాత కూడా బైబిలు అనువాదం సవరణ కొనసాగాయి.

ఆ తర్వాత అప్పటివరకు ముద్రితమైన బైబిలు అనువాదా లను సవరించాలనే నిర్ణయాన్ననుసరించి 1904 సంవత్స రంలో ఆద్యంతాలు ఒకే శైలిలో ఉండేలాగా అను వాదాలన్ని టినీ సవరించి సరిక్రొత్త బైబిలును విడుదల చేశాడు. అనం తరం, మళ్లీ సవరణతో కూడిన ప్రతిని తయారు చేయడంలో చర్చ్ మిషనరీ సొసైటీకి చెందిన డి.అనంతం బి.శీనయ్య అనేవారు లండన్ మిషనరీ సొసైటీకి చెందిన మిషనరీలు ఇ.లూయిస్, జె.ఆర్.బేకన్ అనేవారికి సహాయ పడ్డారు. ఇతర భారతీయ భాషల్లో లాగానే తెలుగు భాషలో కూడా వివిధ మాండలికాలు ఉన్నందున అందరికీ ఆమోద యోగ్యమైన బైబిలును సిద్ధం చేయడం చాలా కష్టతరమైంది. 1904 సంవత్సరంలో సవరించిన బైబిలు ప్రతిమీద సలహా లను సూచనలను కోరడం జరిగింది. ఈ సవరణలో సలహాలు సూచనలు ఇచ్చినవారిలో గుంటూరు లూథరన్ మిషన్కు చెందిన రెవ.డా.ఎఫ్.ఎల్.ఊల్ఫ్, రెవ.డా.జాన్ అబర్లీ; గోదా వరి డెల్టా మిషనుకు చెందిన జాన్ బీర్ వంటి ప్రముఖు లున్నారు. ఈ ప్రయత్నాల ఫలితం – అంతకు ముందున్న బైబిలు ప్రతులకంటె కూడా అందరికి ఆమోద యోగ్యమైన తెలుగు బైబిలు ముద్రణ (1911). ఆ తర్వాత బైబిలు ప్రతిని పెద్దగా మార్చలేదు. అయితే, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఆంధ్ర క్రిష్టియన్ కౌన్సిల్ లిటరేచర్ సెక్రటరీ రెవ.డా. ఈ.ప్రకాశం ఆధ్వర్యంలో 1953 సంవత్సరంలో మరోసారి తెలుగు ముద్రణ జరిగింది. రెవ.డా.ఈ.ప్రకాశం సికిందరా బాదు బైబిలు సొసైటీకి సెక్రటరీగా కూడ పని చేశారు.

అధికారిక తెలుగు బైబిలు అనువాదం మరియు ముద్రణ ఇలా ఉండగా, తెలుగు బైబిలుకు సంబంధించిన మరో అంశాన్ని కూడ ఇక్కడ ప్రస్తావించడం అసందర్భం కాబోదు. 1913, 1914 సంవత్సరాలలో మత్తయి లూకా సువార్తలు పద్యరూపంలో ముద్రితమయ్యాయి. రెండు సంవత్సరాల తర్వాత రోమా గలతీ పత్రికలను మరికొంత కాలం తర్వాత క్రొత్త నిబంధనను సంక్షిప్తంగా పద్యరూపంలో ప్రచురించారు. ఏలూరు సమీపంలోని లక్కవరం జమీందారు రాజా ఎమ్.

భుజంగరావు రచనలే ఈ పద్యాలు. లూథర్ మిషన్ ఆస్పత్రిలో తన భార్యాబిడ్డలకు జరిగిన వైద్యం ఈ రాజావారి దృష్టిని క్రైస్తవ్యంవైపు మరల్చింది.

**పురావస్తు శాస్త్రం - బైబిలు**

పురావస్తుశాస్త్రం గతానికి సంబంధించిన శిథిలాలను ఉపకరణాలను పరిశీలించడం ద్వారా కాలగర్భంలో కలిసి పోయిన నాగరికతలను అధ్యయనం చేస్తుంది. భూగర్భంలోని శిథిలాలను వెలికి తీయడం కూడ ఈ అధ్యయనంలో భాగమే. పురాతన పట్టణాల శిథిలాలను వెలికి తీసినప్పుడు ఒకేచోట వివిధ నాగరికతలకు చెందిన శిథిలాల దిబ్బలను పురావస్తు పరిశోధకులు కనుగొన్నారు. ప్రాచీన నగరాల శిథిలాలపై తర్వాత కాలంలో క్రొత్త నగరాలను నిర్మించారు. ఈ దిబ్బలు ఎన్నో వాస్తవ కథనాలను విన్పిస్తాయి. శిథిలాల త్రవ్వకంలో బయటపడిన ఉపకరణాలను రెండు విధాలుగా విభజించ వచ్చు. మొదటిది : భవనాలు (ఇండ్లు, దేవాలయాలు), విగ్రహాలు (లేక ప్రతిమలు), మట్టికుండలు, ఆయుధాలు, వ్యవసాయ పనిముట్లు, గృహోపకరణాలు. రెండవది : దస్తావేజులు, శిలాశాసనాలు.

పురావసుశాస్త్రం బైబిలు అధ్యయనానికి ఎలా దోహదం చేస్తుంది? త్రవ్వకాల్లో లభించిన శిథిలాలు ఉపకరణాలు దస్తావేజులు బైబిలును అధ్యయనాన్ని మరింత మెరుగు పరచాయి. ప్రాచీన ఇశ్రాయేలు సంస్కృతితోబాటు ఇశ్రా యేలు చుట్టుప్రక్కల వున్న దేశాల చరిత్ర సంస్కృతులను అర్థం చేసుకోడానికి కూడ పురావస్తుశాస్త్రం ఎంతో సహకరిం చింది. ఇశ్రాయేలు ప్రజలు కనానులో నివసించడానికి పూర్వం అక్కడ నివసించిన ప్రజల గురించి చరిత్ర గురించి సంస్కృతి గురించి మతం గురించి తెలుసుకోడానిక కూడ పురావస్తు శాస్త్రం తోడ్పడుతుంది. త్రవ్వకాల్లో దొరికిన ఉపకరణాలు వస్తువులు గత సంస్కృతుల మతాల ప్రభావాన్ని సహితం తెలియజేస్తున్నాయి. బైబిలు అధ్యయనానికి దోహదం చేసే పురావస్తుశాస్త్ర విభాగాన్ని 'బైబిలు సంబంధిత పురావస్తు శాస్త్రం అని పిలుస్తారు. చరిత్ర సంస్కృతుల గురించి సరైన అవగాహన లేకుండా బైబిలును అర్థం చేసుకోవడం కష్టంతో కూడుకున్నపని.

**పురాతన ప్రతులు ఏం వెల్లడి చేస్తున్నాయి?**

పురాతన రాతల్లో కొన్ని హెబ్రీ పదాలను కనుగొనేవరకు కూడ బైబిల్లో ఈ పదాలను కచ్చితంగా అనువదించడం బైబిలు అనువాదకులు ఎదుర్కొన్న సమస్యల్లో ఒకటి. ఈ రాతల్లోని హెబ్రీ పదాలను బైబిల్లోని హెబ్రీ పదాలతో పోల్చి చూచినప్పుడు వీటి అర్థం మరింత స్పష్టంగా తెలిసింది. కొన్ని పురాతన రాతలు మత సాంప్రదాయాల గురించి రాజ్యపరిపాలనా పద్ధతుల గురించి చరిత్ర గురించి నాటి ఇశ్రాయేలు యిరుగుపొరుగు ప్రజల సంస్కృతుల గురించి వివరిస్తాయి. ఈ రాతల్లో కొన్నిటిని రాతి పలకలమీద మట్టిపలకలమీద పగిలిన మృణ్మయపాత్రల మీద ఎండిన జంతుచర్మాల మీద పాపిరస్ అట్టల మీద రాశారు. పాపిరస్ అనే రెల్లు దుబ్బుల నుంచి చేసిన కాగితపు అట్టలను పాపిరస్ అట్టలు అని పిలిచేవారు.

పురావస్తు పరిశోధకులు కనుగొన్నవాటిలో ముఖ్యమైనది పది అంగుళాల పొడవున్న మట్టి పీపా. యిదే కోరెషు స్థూపం. ఈ స్థూపంమీద క్రీ.పూ. 500లో అక్కాడియన్ భాషలో వ్రాసిన సమాచారం వుంది. బబులోను రాజ్యాన్ని ఓడించిన పారసీక రాజైన కోరెషు విజయగాథలను ఈ శాసనం తెలియజేస్తుంది. కోరెషు రాజు తన రాజ్యంలోని ప్రజలపట్ల పరమతసహనం చూపించాడని కూడ ఈ శాసనం తెలియజేస్తుంది. అలాగే, బబులోనువారు కొల్లగొట్టి తీసుకుపోయిన యెరూషలేం దేవాలయ ఉపకరణాలతో బాటు యూదులు తమ స్వదేశానికి తిరిగి వెళ్ళాడానికి కోరెషు రాజు వారిని అనుమతించినట్లు కూడ ఈ శాసనం తెలియజేస్తుంది (ఎజ్రా 1:1-11). కొన్ని యితర పురాతన ప్రతులు కూడ ఎజ్రా నెహెమ్యా గ్రంథాల్లోని సంఘటనల గురించి తెలియజేస్తాయి. పురావస్తు ఆధారాలు సహితం ఈ సంఘటనల వాస్తవికతను రుజువు చేసున్నాయి.

క్రీ.పూ. 927లో ఐగుప్తురాజైన షీషకు యెరూషలేం మీద దాడిచేసి దేవాలయాన్ని కొల్లగొట్టాడు (1 రాజులు 14:25, 26; 2 దిన 12:2-4). ఈజిప్టులోని థేబ్స్ నది సమీపంలో వున్న అమ్మోన్ గుడి గోడల మీద వున్న ఈ శాసనాలను పురా వస్తు పరిశోధకులు కనుగొన్నారు. పాలస్తీనాలో షీషకు విజయ గాధలను ఈ శాసనాలు తెలియజేస్తాయి. సొలొమోను అనం తరం రాజ్యం బలహీనమై ఉత్తర (ఇశ్రాయేలు), దక్షిణ

(యూదా) రాజ్యాలుగా వేరైపోయినప్పుడు షీషకు పాలస్తీనాపై దండెత్తాడు.

చరిత్రలో మైలురాయి అనదగిన సంఘటన 1947 సంభవించింది. గొర్రెలను కాచే బాలుడొకడు తప్పిపోయిన గొర్రె కొరకు ఒక గుహలో వెదికాడు. ఈ గుహ మృత సముద్రానికి పడమరగా వుంది. ఈ గుహలో మృతసముద్రపు గ్రంథపుచుట్టలు బయటపడ్డాయి. క్రీ.పూ. 250 – క్రీ.శ. 68 మధ్య కాలంలో ఈ గుహల్లో నివసించిన ఎస్సేనీ సమాజం గురించి ఈ గ్రంథపు చుట్టలు తెలియజేస్తాయి. మతపరమైన రాజకీయపరమైన కారణాలవల్ల యెరూషలేంను విడిచిపెట్టి ఖుమ్రాన్ ప్రాంతంలోని నిర్జన ప్రదేశాల్లో జీవించిన మతాభిలాష కలిగిన వర్గం ఎస్సేనీయులు. ఖుమ్రాన్ గుహల్లో దొరికిన వాటిలో అతి ముఖ్యమైనవనదగినవి పాతనిబంధన గ్రంథపు చుట్టలు. యివి అత్యంత ప్రాచీనమైన హెబ్రీ లేఖనాలు. వీటిలో మరీ విలువైనది యెషయా గ్రంథం. క్రీ.పూ. 150 – క్రీ.పూ. 50 మధ్యకాలంలో వ్రాసిన యెషయా గ్రంథపు ప్రతి ఈ చుట్టలో వుంది. జంతు చర్మాలపై వ్రాసిన ఈ వ్రాతప్రతి సుమారు ఇరవై అడుగుల పొడవుంది. యిది యిప్పటికి అతి భద్రంగా వుంది.

***గతాన్ని వెలికితీయడం:*** పురావస్తు ఆధారాలు బైబిల్లోని సంఘటనలను నిర్ధారిస్తున్నాయి. బైబిల్లోని ప్రతి సంఘటనకు పురావస్తు ఆధారాలు లభ్యం కాకపోయినప్పటికీ బైబిలు వివరించే చాలా సంగతులు పురావస్తు ఆధారాలతో పొంతన కలిగి వుంటాయి. ఉదా : క్రీ.పూ. 1000లలో పాలస్తీనాలోను పరిసర ప్రాంతాల్లోనూ ఫిలిష్తీయులు నివసించారని పురావస్తు ఆధారాలు తెలియజేస్తున్నాయి. ఇరుగు పొరుగున వున్న ప్రజలకు (ఇశ్రాయేలీయులతో సహా) వీరినుంచి ముప్పు పొంచి వుండేది. బహుశా ఇందుకొరకే ఇశ్రాయేలు ప్రజలు తమను కాపాడడానికి తమకొక బలమైన రాజు కావాలని కోరుకొని వుండవచ్చు (1 సమూ 8)

క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దం నాటి యూదాలో పల్లె ప్రాంతాల గురించి పురావస్తు పరిశోధకులు చేసిన అధ్యయనాలు అవి చాలా కాలం ఏ జనవాసాలూ లేని నిర్జన ప్రాంతాలని తెలియజేస్తున్నాయి. బబులోను చెరకు ఇది బలమైన రుజువు. క్రీ.పూ. 586–538 మధ్య కాలంలో బబులోనులో యూదుల ప్రవాసం (చెర) కొనసాగింది. క్రీ.పూ. 538లో పారసీక రాజైన కోరెషు యూదులు తిరిగి తమ స్వదేశానికి వెళ్లవచ్చని అనుమతించాడు. ఈ దిగువ ప్రస్తావించిన స్థలాల్లో ముఖ్యమైన పురావస్తు ఆధారాలు బయటపడ్డాయి.

**యెరికో:** యెరికోలో వివిధ నాగరికతలకు చెందిన శిథిలాలను కనుగొన్నారు. వీటిల్లో అతి పురాతనమైన నాగరికత క్రీ.పూ. 5000 నాటిది. అంటే ఇశ్రాయేలీయులు యెరికోను జయించక పూర్వం కొన్ని వేల సంవత్సరాల క్రితం నాటిదని తెలుస్తుంది (యెహోషువ 5:13–6:27). ఆ తర్వాత, పురావస్తు పరిశోధకులు యెరికోలో ఒక భవంతి శిథిలాలను కూడ కనుగొన్నారు. ఇది మహా హేరోదు శీతకాలపు విడిది భవనం అని నిర్ధారించారు.

**షెకెము, గెరిజీము పర్వతం, సమరయ (షోమ్రోను):** ఇవన్నీ పాలస్తీనా మధ్య ప్రాంతంలో వున్నాయి. ఇవి ఉత్తరగోత్రాలకు చెందిన ప్రజల ఆరాధనకు రాజకీయజీవితానికి కేంద్రాలు కూడ.

**మెగిద్దో:** ఇక్కడ సొలొమోను గుర్రపుశాలలను కనుగొన్నారు (1 రాజులు 9:19). ఇక్కడ త్రవ్వకాలు జరిగిన ప్రాంతం సుమారు డెబ్బయి మైళ్ల లోతులో అనేక పొరలతో నిండి వుంది.

**యెరూషలేం:** ఇక్కడ హిజ్కియా సొరంగాన్ని కనుగొన్నారు. క్రీ.పూ. 701లో అష్షూరువారు యెరూషలేంను ఆక్రమించినప్పుడు నగరంలోనికి నీటి సరఫరా కొరకు ఈ సొరంగ మార్గం ఉపయోగపడింది (2 రాజులు 20:20).

**కపెర్నహూము:** ఇక్కడ యూదుల సమాజమందిరాన్ని కనుగొన్నారు. ఇది ప్రాచీన కాలానికి చెందింది. బహుశా మార్కు 1:21లోని సమాజమందిరం యిదే కావచ్చు. సమీపంలో ఒక జాలరి గృహాన్ని కూడ కనుగొన్నారు. ఈ గృహం క్రీస్తు శకం మొదటి శతాబ్దానికి చెందింది.

**ఎఫెసు:** ఇక్కడ అర్తెమిదేవి గుడిని కనుగొన్నాడు. ఈ గుడిలో చిన్న చిన్న వెండి ప్రతిమలున్నట్లు తెలిపే వ్రాతలను కూడ కనుగొన్నారు. బహుశా అ.కా. 19:24 లోని వెండి గుళ్లు యివే కావచ్చు.

**(సశేషం)**



**శ్రీమతి కె. రేచల్ జోసఫ్,**
**హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్**

# హాగరు

అబ్రాము కనాను దేశములో పదియేండ్లు కాపురమున్న తరువాత అబ్రాము భార్యయైన శారాయి తన దాసియైన హాగరు అను ఐగుప్తీయురాలిని తీసికొని తన పెనిమిటియైన అబ్రామునకు భార్యగా ఉండునట్లు అతనికిచ్చెను.

బైబిలు గ్రంథములో ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు మనకు తెలియపరచబడిన స్త్రీలలో స్త్రీకి జన్మించిన స్త్రీలలో దేవుడు మాట్లాడిన మొదటి స్త్రీ హాగరు. ఈమె అబ్రాము వంశీయురాలు కాదు. చిన్నతనము నుండి దేవుడైన యెహోవాను ఎరిగినది కాదు.

అబ్రాము వెండి బంగారము కలిగి బహు ధనవంతుడై యుండెను. అతని ఇంట పుట్టి అలవరచబడిన మూడు వందల పదునెనమండుగురు యోధులు కలిగియుండిరి. ఆ దేశవాసుల మధ్య మహారాజై యుండెను. ఆయన సంస్థానములో ఆయనపై ఆధారపడి జీవించేవారు దాదాపు వెయ్యి కుటుంబములు. వీరిలో ఎందరో యౌవన స్త్రీలు కన్యలు ఉన్నారు. అప్పటికి 76 సంవత్సరాల వయసున్న శారాయి తను ఇక పిల్లలను కనగలిగిన స్త్రీ తత్త్వమును కోల్పోయినదని గ్రహించి తన దాసి అయిన ఐగుప్తీయురాలిని తన పెనిమిటికి భార్యగా ఇచ్చినది.

ఈ సంఘటన జరుగక మునుపు యెహోవా వాక్యము అబ్రాహామునకు దర్శనమందు వచ్చి ...నీ గర్భవాసమున పుట్టబోవుచున్న వాడు నీకు వారసుడగునని చెప్పెను. శారాయి గర్భవాసమున అని అనలేదు. దేవుని దృష్టిలో శారాయి గొప్పతనము లేదు. హాగరు తక్కువ తనము లేదు. అయితే హాగరును నేటి ఒక గొప్ప జనాంగమునకు జనకురాలిగా ఎన్నుకొనుటకు ఆమె గొప్పతనము ఏమిటి? ఆమె అబ్రాము భార్య అయిన తర్వాత అబ్రాము దేవునియందు ఆమె విశ్వాసమే తన యజమానురాలి ప్రేమకు పాత్రురాలై ఆమె పెనిమిటిని పంచుకొనినది.

శారాయి హాగరును శ్రమపెట్టినందున ఆమె యొద్ద నుండి పారిపోయినది. కాని శారాయితో తగవులాడలేదు. యెహోవా దూత అరణ్యములో నీటిబుగ్గ యొద్ద ఆమెను కనుగొని, నీ యజమానురాలి యొద్దకు తిరిగివెళ్ళి ఆమె చేతిక్రింద అణగియుండుము అని చెప్పిన మాటకు ఆమె అహం ఆమెకు అడ్డురాలేదు. దేవుని మాట ఎంత కఠినముగా కనిపించినా లోబడుటకు ఎంతటి విశ్వాస జీవితము కలిగియుండాలి? దేవునికి 'చూచుచున్న దేవుడవు నీవే' అను పేరు తనతో మాటలాడిన యెహోవాకు పెట్టెను. దేవునికి పేరు పెట్టిన మొదటి మానవురాలు ఈమె. ఎంత గొప్ప ధన్యత. వాగ్దాన పుత్రుడైన ఇస్సాకు వివాహము కాకమునుపు ఈ నీటిబుగ్గ యొద్దనే నివశించి ఇక్కడనే ఆయన దేవుని ధ్యానించేవాడు. ఇక్కడనే రిబ్కాను ఆయన స్వీకరించాడు.

శారా కనాను దేశమందలి హెబ్రోనను కిర్యతర్బాలో మృతి పొందినప్పుడు అబ్రాహాము ఆమె దగ్గర లేదు. శారా మరణ వార్త విని ఆమెను గూర్చి అంగలార్చుటకును ఆమెను గూర్చి యేడ్చుటకును వచ్చెను. శారా నీతో చెప్పు ప్రతి విషయములో ఆమె మాట వినుము అని చెప్పిన దానినిబట్టి అబ్రాహాము ఇష్మాయేలును, హాగరును శారా యొద్దనుండి పంపివేసెను. అయితే ఆమెను వదలి వేయలేదు. హాగరు అబ్రాహాము భార్య. ఆమె విశ్వాసి. ఆమె రెండవ ప్రయాణములో దేవుని దూత ఆకాశము నుండి హాగరును పిలిచినది. ఆ చిన్నవాడు ఉన్నచోట దేవుడు వాని స్వరము వినియున్నాడు. తర్వాత దేవుడు ఆమె కన్నులు తెరచినందున ఆమె నీళ్ళ ఊట చూచినది. దేవుడు ఆ చిన్నవానికి తోడైయుండెను. నేడు మన పిల్లలకు దేవుడు తోడైయుండవలెనని మనము కోరు కుంటాము, ప్రార్థిస్తాము. హాగరు యొక్క మనుమలు 12 మంది రాజులు.

**3**

# మధ్యకాలము

## (ప్రవక్తయైన మలాకీ కాలము నుండి బాప్తిస్మమిచ్చు యోహాను వరకు గల మధ్యకాలములోని యూదుల చరిత్ర)



బ్రదర్ కె.సామ్రాట్

ఈ హెరియోడరన్ అతని రాజైన సెకిసమ్‌ను రాజ్య కాంక్షతో విషమిచ్చి చంపెను. కాని అంతియోకస్‌కు మరొక కుమారుడైన అంతియోకస్ ఎపిఫనెస్ పెర్గతు రాజైన యూమి నిస్ అతని సోదరుడు అతియాలస్‌ల ద్వారా సిరియారాజుగా నియమించబడ్డాడు. అందువలన హెలియోడరస్ పన్నాగ మంతా నిరర్ధకమైనది. ఎపిఫనెస్ సింహాసన మధిష్టించిన నాటనుండి ప్రజల నుండి అనేక విధాలుగా పన్నులు వసూలు చేయమని రోమీ యులచే ఒత్తిడి చేయబడెను. కనుక అనేక విధాలుగా ప్రజల నుండి ద్రవ్యము వసూలు చేయుచుండెను. అంతేకాక పవిత్ర మైన ప్రధానయాజకుడైన ఒనియాస్ యొక్క యాజకత్వమును సంవత్సరమునకు 360 తలాంతులకు అతని సోదరుడైన జాసన్‌కు అమ్మివేసెను. ఆ తర్వాత జాసన్‌ను కూడా తొలగించి అతని యాజకత్వమును అతని సోదరుడైన మెనిలాస్‌కు మరొక 300 తలాంతులకు అధికముగా అమ్మివేసెను. ఈ సంఘటన క్రీ॥పూ॥ 174లో జరిగెను.

మెనిలాస్ ఈ విధంగా అన్యాయపు పద్ధతిలో యాజకత్వం సంపాదించి ప్రతి సంవత్సరం అదనపు పన్ను కట్టుటకు నిశ్చయించుకొనెను. అతను అనేక బంగారు పాత్రలను దేవాలయము నుండి దొంగిలించి వాటిని ద్రవ్యముగా మార్చి రాజునకు చెల్లించెను. అంతియొకయ గవర్నరైన ఆంద్రోని కస్‌కు లంచమిచ్చిన తన అన్న అయిన ఒనియాస్ ఏదైనా ఒకరోజు తనకు అడ్డువచ్చునన్న అనుమానముతో చంపించెను. ఇది సత్యము. ప్రజలు అంద్రోనికస్‌ను ముట్టడి వేసి అతడు జరిగించిన దుర్మార్గపు పనులకు, హత్యకు అతడిని శిరచ్ఛేదనము చేసిరి. మరియు లిసిమాకస్ యెరూషలేము యొక్క అల్లరిప్రజలచే చంపబడెను. అయినప్పటికీ మెనీలాస్ తనను రక్షించుకొనుటకు, యెరూషలేము నుండి సన్‌హెద్రిన్ సభయొక్క ముగ్గురు విచారణ సభ్యులు అతనిని విచారణ చేయుటకు వచ్చియుండగా లంచమిచ్చి వారిని కూడా శిరచ్ఛేదనము గావించెను.

అంతియొకస్ ఐగుప్తు యుద్ధములో నిమగ్నమై యున్నప్పుడు మెనిలాస్ చనిపోయెననెడి అబద్ధపు వార్తను పుట్టించి వెయ్యిమంది పురుషులతో నడచుకొంటూ వెళ్ళి యెరూషలేము పట్టణమును ఆశ్చర్యపరచి మెనీలాస్‌ను కోటలోవేసి బంధించి కత్తిచేత చంపెను. మరియు తనకు వ్యతిరేకముగా ఉన్న వారినందరిని చంపెను.

ఈ వార్త అంతియొకయ అంతట వెంటనే వ్యాపించెను. కాని అతడు యూదుల యొక్క విధేయతనుబట్టి వారిని చంపకుండునట్లు త్వరపడెను. మార్గమధ్యంలో యెరూషలేము వాసులు అతని మరణవార్తను విని గొప్ప సంతోషముతో యుండిరని అతనికి మార్గములో తెలుపబడెను. కనుక అతడు ఎంతో రౌద్రుడై క్రీ॥పూ॥ 170లో తుఫానువలె నలభైవేలమంది యూదులను చంపి ఎక్కువమంది ప్రజలను పొరుగుదేశము లకు బానిసలుగా అమ్మెను. అతడు అతి పరిశుద్ధ స్థలమున ప్రవేశించి బలిపీఠము మీద ఆడుపందిని బల్యర్పణ చేసి ఆ రక్తమంతటిని ఆలయమంతట చిలకరించెను. అతడు 800 మణుగుల బంగారమునకు సమానమగు వస్తువులను, బంగారమును కొల్లపెట్టెను. అంతియొకయకు తిరిగి వచ్చిన తర్వాత ఫిలప్పు అను క్రూరడైన కసాయి వ్యక్తిని యూదయ దేశపు గవర్నరుగా చేసెను. ఆంద్రోనికస్ అను చెడ్డవ్యక్తి సమరయదేశపు గవర్నరుగా ఉండి అందరికంటే చెడిపోయిన రెండవ మెనీలాస్‌ను యాజకత్వములో ఉంచెను. అతని అరాచకత్వనకు, అవి చాలవన్నట్లు అతని సైన్యాధిపతియైన అపొల్లోనియస్ ఆధిపత్యములో ఇరవై రెండువేల సైనికులను

యెరూషలేమునందలి పురుషులందరిని కత్తిచేత చంపబడు నట్లు స్త్రీలను పిల్లలను బానిసలుగా చేసి సబ్బాతు దినమందు తీవ్రముగా వధించిరి. చాలామంది త్వరపడి తప్పించుకొని కొండలలోనికి, గుహలలోనికి పారిపోయిరి.

ఈ కౄరత్వము వెంటనే చెదరిపోయిన యూదులందరిని వెంటాడెను. గ్రీకు రాజు విగ్రహారాధికుడైన ఆథేనియస్ రాజు ద్వారా యూదా ప్రజలందరు కూడా విగ్రహారాధన చేయవలెనని, ఆ విధముగా చేయుటకు నిరాకరించిన వారందరిని కౄరముగా హత్యచేయబడునని ఆజ్ఞాపించెను. ఇదే సమయంలో అనగా క్రీ॥పూ॥ 167లోనే దేవాలయములో జ్యూపిటర్ ఒలంపస్ అను దేవతయొక్క విగ్రహము ప్రతిష్ఠ చేయబడెను. ధర్మశాస్త్రము యొక్క పుస్తకాలు కాల్చివేయబడెను.

స్త్రీలు హింసించబడిరి, వారి పిల్లలు సున్నతి చేయబడి తల్లుల మెడలకు కట్టి వీధులలో ఉంచబడిరి. ఆ తర్వాత గొడలయొక్క ఎత్తయిన ప్రాంతములలో వ్రేలాడదీయబడిరి. ఎందుకంటే ఎక్కువమంది ఆ అన్య దేవతను ఆరాధించి వెంబడించి నిజదేవుని తృణీకరించుట కంటే మరణించుటనే ఎన్నుకొనిరి అని పవిత్రుడు, వృద్ధుడు, మతాసక్తి మనోబలము కలిగిన ధర్మశాస్త్రము యొక్క ముఖ్య వైద్యుడైన ఎలియాజరు, నాయకురాలైన సలోమెనా, ఆమె యొక్క ఏడుగురు కుమారులు సాక్ష్యమిచ్చిరి. వారిని మారణాయుధాలు భయపెట్టలేదు. క్రూరుడైన రాజు వెంటాడి పెట్టిన చిత్రహింసలకు వారు భయపడలేదు. సర్వశక్తిగల్గిన దేవుని వైపే శ్రద్ధవహించిరి గాని విగ్రహారాధనకుగాని, వేషధారణతో దాగుకొనుటకు గాని ఇష్టపడలేదు.

అస్మోనాస్ ముదిమనుమడు మొదటి తరగతి పౌరుడై యుండి యెరూషలేము చెరనుండి దాను గోత్రములోని మోదీను అను స్థలమునకు అతని ఐదుగురు కుమారులైన జాన్ (యోహాను), సీమోను (సైమన్), యూదా (జూదాస్) ఎలియాజరు మరియు యోనాతాను అనువారితో తరలి వచ్చెను. కాని అంతియోకస్ వారిని కనుగొని అపెల్లెస్‌ను ఆ స్థలమునకు పంపించి ఆ నివాసులందరు విగ్రహారాధన వైపు మళ్ళువరకు మరణకరమైన బాధకల్గించినట్లు అధికారమునిచ్చెను. ఆ అధికారి మత్తయిని విగ్రహారాధన చేయునట్లు రాజు యొక్క మన్ననలను పొందునట్లు చేయుటకు గొప్ప ధననిధిని అతనికి ప్రమాణము చేసెను. కాని ఆ యధార్థవర్తనుడైన బోధకుడు వాటిని పరిహాసముగా తృణీకరించెను. విగ్రహారాధన యొక్క బలిపీఠము నెదుర్కొనుటకు సాహసించిన మొదటి యూదుని చంపివేసెను, అతడు తన కుమారుల యొక్కయు, అనుచరుల యొక్కయు సహకారముతో రాజు చట్టమునకు వ్యతిరేకముగా అతనిని, అతని అనుచరులందరిని చంపివేసెను. తర్వాత తనంతట తాను అనేకమంది యూదులను ప్రోగుచేసి వారికి నాయకుడిగా వుండెను. మరియు అన్యుల విగ్రహాలు, బలిపీఠాలు పడద్రోసి తన వారందరితో కలసి కొండగృహాల లోనికి వెళ్ళెను. వారిలో చాలాభాగము అస్సిదనులతో కలసెను. వీరు చాల శూరులు. ఎక్కువ బలముతోను, ఎక్కువ కష్టములను ఎదుర్కొనుటకు, హత్యలు జరిగించుటకు, యెరూషలేము దేవాలయమును తిరిగి పొందుటకు వారి ప్రాణములు సహా ఇచ్చుటకు నిశ్చయించుకొనినవారు. వీరి వలన ఇంకా ఎక్కువ మంది కూడుట వలన మత్తయి శత్రువులను ఎదుర్కొను శక్తిని పొందెనని తలంచెను. కాని అది వారి తప్పుడు అభిప్రాయము. విశ్రాంతి దినమును ఆచరించు సమయము నందు వారి శత్రువులు వారు ఆశ్చర్యపడునట్లు వారిపైపడి ఎన్నో నష్టములు కల్గించిరి. ఎందుకంటే వారి శత్రువుల నుండి కాపాడుకొనుటకు సబ్బాతు దినమందు వారి శత్రువులతో యుద్ధము చేయరు. మత్తయి ప్రజలందరు ఏకగ్రీవముగా సబ్బాతు దినమందు శత్రువులతో యుద్ధము చేసి వారిని వారు రక్షించుకొనునట్లు ఒక చట్టము అమలు పర్చిరి. కనుక వారు బలము తెచ్చుకోని విశ్రాంతి దినమందు శత్రువులతో పోరాడవచ్చును.

ఈ ఆజ్ఞ దాఖలు తేయబడిన తార్వత పెద్దలు మరియు అనేక మంది యాజకులు మత్తయి దాగుడు స్థలములను విడిచిపెట్టి యూదా పట్టణముల చుట్టూ తిరిగి అన్యుల బలిపీఠములన్నీటిని పడద్రోసి నిజదేవుని ఆరాధనకు సున్నతి ఆచారమును యుంచిరి. మరియు మార్గములో ఎదురైె ప్రతి హాని కలిగించినవారిని, మతమును విడచిన వారిని నరికి వేయుచు చివరకు 147 సంవత్సరాల వయస్సులో ఈ

అవినీతి క్రియలతోనే మత్తయి మరణించెను.

అతనికి మరణము సమీపించుచుండగా అతని ఐదుగురు కుమారులు అతడు ప్రారంభించిన విధముగానే దేవుని కొరకు జీవించమని బలపరచెను. అతని కుమారుడైన యూదాను సైనికదళమునకు ముఖ్యాధ్యక్షుడు గాను (కమాండర్) సీమోను సలహాదారుని గాను నియమించెను. క్రీస్తుపూర్వం 166వ సంవత్సరంలో మోదిన్ ప్రాంతంలో అతడు ఇశ్రాయేలీయుల యొక్క గొప్ప ప్రలాపములతోను ఆర్భాటముతోను సమాధి చేయబడెను. యూదా ముందు జరిగిన సంఘటనలలో గొప్ప యోధునిగా గుర్తింపబడెను. అంతేకాక మక్కాబియస్ అను బిరుదుతో గుర్తింపబడెను. తన ప్రజలయొక్క భారములను తనపై వేసుకొని అతని తండ్రిచే పునరావృత్తమగుచున్న మంచిపనులను వెంబడించుచుండెను. మరియు పట్టణము లన్నింటిని మార్పు చేయుటకు కొలతలు తీసుకొనెను. తనకు వ్యతిరేకముగా వచ్చుచుండిన ప్రతిదానిని అడ్డగించుటకు బలమైన గేరాసేనులను ఆ దేశపు స్వాతంత్ర్యమును, మతమును కాపాడుటకై యుంచెను.


అంతియొకస్ అతనికి వ్యతిరేకముగా వచ్చుచున్న సమరియ సైన్యమును ఎదుర్కొనుటకు అపోల్లోనియస్‌ను పంపించెను. కాని అతడు చంపబడెను, మరియు అతని సమూహమంతయు ఒక యవ్వన సైన్యాధిపతి వలన ఓడింపబడి చంపబడెను. అపోల్లోనీయస్ కత్తి వారి మధ్య పడియుండుట చూచి యూద దానిని తీసికొని సామాన్యంగా దానితోనే పోరాడే వాడు.

ఈ వార్త కాలొసిరియా ప్రాంతమునకు వ్యాపించగా నెరాను అను ప్రాంతపు ఉప అధ్యక్షుడు తన బలమంతటిని ప్రోగు చేసుకొని అపొల్లోనియస్ మరణమునకు ప్రతీకారము తీర్చుకొనుటకు బయలుదేరెను. కాని అతను కూడా అపొల్లోని యస్ వలెనే మరణించాడు. అంతియొకస్ ఈ ఓటమి వలన బహు కలవరము కల్గిన వాడై 40,000 కాల్బలము, 7,000 గుర్రములను అనేకులైన చుట్టుప్రక్కల దేశస్థులైన ప్రజలను మార్పునొందిన యూదులతో కలిసి క్రీ॥పూ॥ 162లో టోలమీ మాక్రాన్, నికోనార్ మరియు జార్జియాస్ అను సైన్యాధ్యక్షులతో యూదయపై దండయాత్రకు ఆజ్ఞ జారీ చేశాడు.

వారు యెరూషలేమునకు ఏడు మైళ్ళ దూరములో ఉన్న ఎమ్మాయి గ్రామము వరకు వచ్చినప్పుడు ఆ సమయంలో యూదా యెరూషలేమును ముట్టడి వేయుచుండగా అన్యుల చేత మిస్పా పట్టణమునకు త్రోలివేయబడెను. ఇక్కడ సైన్య మంతయు వారే దేవతలని చెప్పుకొనిరి. యూదా వారందరిని వారి మతము కొరకు, చట్టము కొరకు, స్వతంత్రము కొరకు తీవ్రముగా హెచ్చరించెను. కాని చివరకు ఒక సంవత్సర కాలములోపల పెండ్లి చేసికొనిన వారిని ఇండ్లు కట్టించుకొనిన వారిని ఏ మాత్రము భయపడినట్లు కనిపించినా వారందరిని సైన్యము నుండి పంపివేసెను.

ఏమైనప్పటికినీ అతను (యూదా) శత్రువుతో యుద్ధము వదలి వేయుటకు నిశ్చయించుకొనెను. కాని ఈ మధ్యలోనే దేవుడు అతనికి సుళువైన విజయము అనుగ్రహించెను. జార్జియాస్ 5 వేల కాల్బలముతో, వెయ్యి గుర్రములతో రాత్రివేళ అతని చిన్న సైన్యమును భయపెట్టుటకు సైన్యమునుండి విడివడగా యూదా ఆ విషయము తెలిసిన వాడై మరొక మార్గముగుండా ప్రయాణము సాగించి జార్జియాస్ లేని సమయమందు సైనిక దళముపై పడి మూడువేల మంది పురుషులను హతమార్చి మిగిలిన వారు పారిపోవునట్లు చేసి గుడారమును ముట్టడి వేసెను. జార్జియాస్ గుడజారములందు యూదులు లేకపోవుట చూచి బహుశా వారు రక్షణ కొరకై పారిపోయి ఉందురని తలంచుచు పర్వతములపైకి వచ్చెను. కాని అక్కడ వారిని కనుగొనక పోవుట చేత తిరిగి వచ్చు సమయమున జరిగిన సంఘటనను చూచి ఆశ్చర్యచికితుడాయెను. వారు యూదా తమకు ఘన స్వాగతమిచ్చునని తలచి మైదానములో నిలువబడి యుండగా యూదా వారిని తరిమి వెంటాడి ఆరువేల మందిని హతమార్చి మిగిలిన వారిలో అనేకమందిని గాయపరచి వికలాంగులను చేసెను. ఈ విజయము వలన యూదాకు యెరూషలేము ద్వారములు తెరువబడెను. గనుక అతడును అతని సైన్య మును మరుసటి దినమైన సబ్బాతు దినమందు గొప్ప భక్తి కృతజ్ఞతలతో విజయోత్సాహము చేసుకొనిరి.

**(సశేషం)**




# శ్రమలు

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభి వందనములు.

ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు తెలుపబడిన కొన్ని శ్రమలు గూర్చి తెలుసుకుందాము.

క్రైస్తవులు ఎందుకు శ్రమపడవలెను? అను ప్రశ్నలకు కారణములు

1. శ్రమ "ఓర్పు" అను ఫలము నిచ్చును. రోమా 5:3, యాకోబు 1:3,4 హెబ్రీ 10:36

2. శ్రమ "సంతోషము" అను ఫలము నిచ్చును. కీర్తనలు 30:5:126:5,6

3. శ్రమ "పరిపక్వత" అను ఫలము నిచ్చును. ప్రసంగి 7:3, 1 పేతురు 5:10

4. శ్రమ "నీతి" అను సమాధాన ఫలము నిచ్చును. హెబ్రీయులకు 12:11

5. క్రైస్తవుడు శ్రమపడుటవలన సాతానుని నోరు మూత పడును. యోబు 1:9,10,20–22

6. శ్రమ సరియైన మార్గమును మనకు సూచించును. కీర్తనలు 119:67,71

7. శ్రమ మన జీవితములను పరిశుద్ధపరచును. యోబు 23:10; కీర్తనలు 66:10–12; యెషయా 1:25:48:10; సామెతలు 17:3; 1 పేతురు 1:7

8. శ్రమలు మనలను క్రీస్తువలె జీవించునట్లు చేయును. హెబ్రీయుల 4:12,13; ఫిలిప్పీయులకు 3:10; 2 కొరింథీ 4:7–10

9. మన శ్రమలు దేవుని మహిమపరచును. కీర్తనలు 50:15; యోహాను 9:1–3, 11:1–4, 21:18,19; ఫిలిప్పీ 1:19,20

10. శ్రమలు మనము పాపము చేయకుండ అడ్డుకొనును. 2 కొరింథీ 12:7,9,10

11. శ్రమలు మనము పాపము చేసినప్పుడు పశ్చాత్తపపడు నట్లు చేయును. న్యాయా. 10:6,7,15,16; కీర్తన. 32:3–5; హోషయా 5:15, 6:1; 2దిన. 15:3,4

12. శ్రమలు మంచి క్రమశిక్షణతో మనలను సరిదిద్దును. 1 పేతురు 4:17

13. శ్రమలు మన కుమారుత్వమును నిరూపించును. హెబ్రీయులకు 12:5,6

14. శ్రమలు మనలను మనకే బయలుపరచును. యోబు 42:6; లూకా 15:18

15. శ్రమలు మనము విశేషముగా ప్రార్థించునట్లు చేయును. యెషయా 26:16

16. శ్రమలు మనలను ఇతర విశ్వాసులకు మాదిరికరముగా నుంచును. 2 కొరింథీ 6:4,5; 1 థెస్సలోనిక 1:6,7

17. శ్రమలలో ఉన్నవారిని ఆదరించు శక్తిగలవారమగు దుము. రోమా 12:15; గలతీ 6:2, 2 కొరింథీ 1:3–5

18. శ్రమలు మనలను క్రీస్తును ప్రకటించు సాక్షులముగా చేయును. అపొ. 8:1–5, 16:25–34; ఫిలిప్పీ 1:12,13; 2 తిమోతి 4:6–8, 16:17

19. శ్రమలు మనము దేవునియందు అత్యధిక విజయములు పొందునట్లు చేయును. 2 కొరింథీ 2:14; రోమా 8:35,37

20. శ్రమలు మనము దేవునివైపు చూచునట్లును ఆయనకు మొఱ్ఱపెట్టునట్లును చేయును. యోబు 42:5 రోమా 8:14,15,18

21. శ్రమలు మనలను దేవునికి సమీపస్థులనుగా చేయును.

1 పేతురు 4:14; 2 కొరింథీ 12:10

22. శ్రమలు మనము గొప్ప సేవ చేయుటకు సిద్ధపరచును. 2 రాజులు 17,18; యోహాను 12:24

23. శ్రమలు మనకు గొప్ప బహుమానమును కలుగ జేయును. మత్తయి 5:10-12, 19:27-29; రోమా 8:16,17; 2 కొరింథీ 4:17

24. శ్రమలు మనము దేవుని రాజ్యము కొరకు సిద్ధపడునట్లు చేయును. 2 థెస్సలోనిక 1:5 2 తిమోతి 2:12

25. శ్రమలు మనకు సర్వోన్నతమైన శక్తిని కనపరచును. రోమా 8:28; 1 కొరింథీ 10:13; కీర్తనలు 66:10-12; ఆది 45:5-8; 50:20

## శ్రమలు - క్రైస్తవుని 13 ప్రతి స్పందనలు

1. శ్రమలకొరకు కనిపెట్టుకొని యుండువలెను. యోహాను 15:19,20: 16:2,20,33 హెబ్రీ 12:9,10; 2 తిమోతి 3:12

2. శ్రమలు ప్రారంభమైన వెంటనే మన ఆత్మను దేవునికి అప్పగించుకొనవలెను. కీర్తనలు 3:5,6; 37:3; 31:5 దాని 3:14-18; హెబ్రీయులకు 6:17-20; 1 పేతురు 4:19

3. మన శ్రమలకు గల కారణములన్నింటిని అర్థము చేసికొనుటకు ప్రయత్నించకూడదు. రోమా 8:28

4. మనము శ్రమలలో ఉన్నప్పుడు ప్రార్థించవలెను. కీర్తనలు 50:15; యోబు 42:10; యాకోబు 5:13; మార్కు 9:20-24

5. ఇతరుల శ్రమలు మనకు అనుభవము తెచ్చును. 1 కొరింథీ 10:13; 1 పేతురు 5:8:9

6. మనకు కలిగిన శ్రమలను తృణీకరించకూడదు. హెబ్రీయులకు 12:5

7. మనము శ్రమపడుచున్నాము గనుక కృంగిపోకూడదు. సామెతలు 24:10; హెబ్రీయులకు 12:5

8. స్థిరమైన మార్గములో మనము శ్రమలయందు ఓర్పుగల వారమైయుండవలెను. రోమా 12:12; 2 తిమోతి 2:3; యాకోబు 5:10; 1 పేతురు 2:20

9. శ్రమలు సంభవించినప్పుడు దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించవలెను. కీర్తనలు 42:5; 1 థెస్సలోనిక 5:16-18

10. శ్రమలు కలిగినప్పుడు మనము సంతోషించవలెను. అపో. 5:40,41; 16:25; ఫిలిప్పీయులకు 4:4; యాకోబు 1:2; 5:11

11. మనకు కలిగిన శ్రమల కారణముగా ప్రాణత్యాగము చేసికొనకూడదు. హెబ్రీ 12:12,13

12. అనవసరముగా శ్రమలు అనుభవించకూడదు. 1పేతురు 2:20; 3:17; 4:15-17

13. మనకు ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ప్రస్తుతము మనము అనుభవించుచున్న శ్రమలు ఎన్నతగినవి కావని యెంచుకొనవలెను. యోహాను 16:20,21; రోమా 8:18

## శ్రమలు కలుగుటకు 5 మూల కారణములు

1. సాతాను క్రియలు కారణము కావచ్చును.
1 యోబు 1-2; లూకా 13:15,16 అపో.కా. 10:38

2. దేవుడు లేని మనుష్యులు కారణము కావచ్చును. 2 తిమోతి 4:14

3. ఈ లోకము యొక్క పద్ధతులు మనము శ్రమపడుటకు కారణము కావచ్చును. 2 పేతురు 2:8

4. విశ్వాసులమైన మన పతన స్వభావమే మన శ్రమలకు కారణము కావచ్చును. రోమా 7:14-23

5. అసూయపరులైన తోటి క్రైస్తవులే మన శ్రమలకు కారణము కావచ్చును. ఫిలిప్పీ 5:15,16; 2 తిమోతి 4:10


**గమనిక**

**GNM మరియు B.Sc. Nursingలలో ఖాళీలు కలవు. మీ పిల్లలను చేర్చాలనుకొనే వారు వెంటనే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేసి మీ సీటు రిజర్వ్ చేసుకోండి**

**9676340371, 9704255416**



శ్రీమతి రిబ్కా విక్రాంత్

# భూకంపములు

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభి వందనములు.

ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు తెలుపబడిన భూకంపములు గూర్చి తెలుసుకుందాము.

1. దేవుడు సీనాయి పర్వతమునుండి ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రమును ఇచ్చినప్పుడు వచ్చిన భూకంపము. నిర్గమ కాండము 19:18

2. ఏలియా హోరేబు పర్వతమందున్న గుహలో ఉన్నప్పుడు కలిగిన భూకంపము. 1 రాజులు 19:11

3. యూదా రాజైన ఉజ్జియా దినములలో కలిగిన భూకంపము. జెకర్యా 14:5; ఆమోసు 1:1

4. ప్రభువైన యేసును సిలువవేసిన తరువాత శతాధిపతియు అతనితో కూడ యేసునకు కావలియున్నవారును, భూకంప మును, జరిగిన కార్యములు చూచి మిక్కిలి భయపడిరి. మత్తయి 27:54

5. ప్రభువు సమాధికి కావలియున్న రోమా సైనికులు యేసు పునరుత్థానమైనప్పుడు కలిగిన భూకంపమునకు భయపడి వచ్చిన వారివలెనుండిరి. మత్తయి 28:2-4

6. పౌలును సీలయు దేవునికి ప్రార్థించగా మహా భూకంపము కలిగి చెరసాల తలుపులన్నియు తెరవబడగా, చెరసాల నాయకుడు అది చూచి తనను తాను చంపుకొన బోయెను. అపో.కా. 16:26,27

7. శ్రమలకాలములో ఈ భూలోకము ఎదుర్కొనబోవు భూకంపములు

(అ) ఆరవ ముద్రను విప్పినప్పుడు కలుగు భూకంపము ప్రకటన 6:12 (ఆ) ఏడవముద్రను విప్పినప్పుడు కలుగు భూకంపం ప్రకటన 8:1-5 (ఇ) ఇద్దరు సాక్షులు పరలోకము నకు ఆరోహణమై పోవుచుండగా కలుగు గొప్ప భూకంపము. ప్రకటన 11:13 (ఈ) దేవుని మహా దినమున జరుగు ప్రపంచయుద్ధ సమయంలో ఏడవ దూత తన పాత్రను వాయు జెకర్యా 14:4,5 మండలము మీద కుమ్మరించినప్పుడు కలుగు మహా భూకంపము. ప్రకటన 16:16-21

**బోధకులు :**

1. మోషే-పరిశుద్ధ గ్రంథములోని మొదటి ఐదు పుస్తక ములను వ్రాసెను మరియు బోధించెను. ద్వితీయోప 4:5

2. సమూయేలు – ఇశ్రాయేలు రాజ్య ప్రారంభ దినములలో బోధించెను. 1 సమూయేలు 12:23

3. దావీదు – కీర్తనల గ్రంథము వ్రాసెను మరియు బోధించెను. సామెతలు 4:4

4. సొలొమోను– సామెతల గ్రంథమును వ్రాసెను మరియు బోధించెను. 1 రాజులు 4:32

5. యెహోషాపాతు పాలనా కాలములో గల పెద్దలు వీరు యూదా పట్టణములలో జనులు ధర్మశాస్త్రమును బోధించిరి. 2 దిన 17:7-9

6. యెషయా – మోషే ధర్మశాస్త్రమును తన ప్రజలకు బోధించెను. 2 దిన 34:30

7. ఎజ్రా – యెహోవా ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకు బోధించెను. ఎజ్రా 7:10

8. ఎజ్రా కాలములోని కొందరు మనుష్యులు యెహోవా ధర్మశాస్త్రమును బోధించిరి. నెహెమ్యా 8:1-8

9. ప్రభువైన యేసు పాతనిబంధనను ఆయన ద్వారా మత్తయి 4:23 దాని నెరవేర్పును బోధించెను. లూకా 24:27

10. బర్నబా, సుమెయోను లూకియ మరియు మనయేసులు అంతియొకయులోనున్న సంఘములో బోధించిరి. అపొ.కా. 13:1

11. పౌలు దేవుని వాక్యమును బోధించెను. అపొ.కా. 18:11; 20:20

12. అపొల్లో ప్రారంభమున బాప్తిస్మము ఇచ్చు యోహాను సందేశమును ఆ తరువాత క్రీస్తును గూర్చి బోధించెను. అపొ.కా. 18:25-28

13. అకుల ప్రిస్కిల్లలు అపొల్లోకు బోధించెను. అపొ.కా. 18:26

14. తిమోతి సంఘ సిద్ధాంతమును బోధించెను. తీతుకు 2:1

15. హెబ్రీయులకు వ్రాసిన పత్రికయొక్క గ్రంథకర్త క్రీస్తులో పాతనిబంధన నెరవేర్పును బోధించెను. హెబ్రీ 5:11-14

## బైబిల్ క్విజ్-9 జవాబులు

1. 17 సంవత్సరములు
2. 130 సంవత్సరములు
3. బేత్లెహేమను ఎఫ్రాతా మార్గమున
4. ఎఫ్రాయిము
5. హిత్తీయుడైన ఎఫ్రోను భూమియందున్న గుహలో
6. 110 సంవత్సరములు
7. షిఫ్రా, పూయ
8. పీతోము, రామసేసు
9. లేవీ
10. మిద్యాను
11. యిత్రో
12. ఏడుగురు
13. సిప్పోరా
14. గెర్షోము
15. పరదేశి
16. యిత్రో
17. హోరేబు
18. ఉన్నవాడను అనువాడను
19. పాలు, తేనెలు ప్రవహించు దేశమునకు
20. అహరోను
21. కొయ్యకాలు
22. హనోకు, పల్లు, హెస్రోను, కర్మీ
23. కహాతు
24. అమ్రాము, యోకెబెదు
25. 137 సంవత్సరములు

**22వ పేజీ తరువాయి....**

అలా విశ్వాసిగా మూడు సంవత్సరములు వెళ్ళాను. ఆ తర్వాత దేవునియొక్క పిలుపు వచ్చి నేను దేవుని యొక్క సేవ చేయాలని స్వరం వినిపించింది. ఆ తరువాత దేవునితో - నేను ఎలా సేవచెయ్యాలయ్య నేను అక్షరం ముక్క కూడా రానివాడనే అని దేవునికి చెప్పాడు. ఆ విషయం నేను వెళ్ళి స్థానిక పాస్టరుకు తెలియచెప్పాను. అప్పుడు అతను ఎగతాళి చేశాడు. అయినప్పటికి సేవ చేయడానికి పూనుకున్నాను. అయితే మా వాళ్ళు కూడా దేవుని నమ్ముకున్నానని ఎగతాళి చేశారు. ఎగతాళి చేయడమే కాక ఊరిలో నుండి వెలివేశారు. అయినప్పటికి నేను నమ్మిన నా జీవము గలిగిన దేవుడు నాకు తోడుగా ఉన్నాడు.

ఈ లోకం వెలివేసినా అన్నదమ్ములు వెలివేసినా నేను మాత్రం దేవుని సేవ ప్రారంభించాను. గంగిరెద్దుల దిబ్బలోనే సంఘాన్ని కట్టాను. దేవుని సేవ చేస్తూ ఉండగా అనేక ఇరుకు ఇబ్బందులుపడ్డాను. కట్టుకున్న ఇల్లు కూడా అప్పుగా తీసు కున్నారు. అయినప్పటికి దేవునిలోనే విశ్వాసంతో ఉన్నాను. అద్దెకుంటూ సేవచేశాను. అలాగు చేస్తూ ఉండగా దేవుడు మెల్లమెల్లగా నా అప్పులు తీర్చాడు. అలాగు ఉంటుండగా నా సాక్ష్యం చెప్పాలని అనేకమంది ఊరు ఊరు తీసుకు వెళ్ళారు. తరువాత తరువాత ఇంకా దేవుడు నన్ను విస్తారంగా ఊరూరు తీసుకువెళ్ళి నా సాక్ష్యం ద్వారా అనేకమందిని బలపరచడానికి సహాయం చేశాడు. దేవుని కృపను బట్టి గుణదల గంగిరెద్దుల దిబ్బలో ఒక చర్చి నిర్మించాము. అక్కడ ప్రస్తుతం మా గంగిరెద్దుల కులము నుండి ఎనభై కుటుంబాలు మారారు. 2001 అగిరిపల్లి దగ్గర కృష్ణాతీరంలో మా గంగిరెద్దువాళ్ళ మధ్య సేవ ప్రారంభించాము. అక్కడ కూడా అనేకమంది మారేటట్లు ప్రార్థించగలరని మనవిచేస్తున్నాను. ఇక సేవలో ఎక్కువగా ముందుకు సాగటానికి ప్రార్థించండి. నా పెద్దకుమారుడు ఇస్సాకు, నా భార్య నా సేవలో సహకరిస్తుంటారు.

# సాక్ష్యము

కృష్ణాజిల్లా గన్నవరం మండలం వెంపల్లి గ్రామము లో జీవించిన పొంకి ఎంకన్న మా తాత. వారికి ఆరుగురు మగపిల్లలు. మా నాన్న పేరు వీరభద్ర రావు, పూజగొల్లలం. ఊరిపై వదలిన ఆంబోతులను కాని మాకు దాతలు ఇచ్చిన ఆవులను ఎద్దులను మచ్చిక చేసి వాటికి విద్య నేర్పి గంగి రెద్దులుగా మార్చి జీవిస్తుంటాము. అందువలన నాకు పది సంవత్సరాల వయస్సులోనే సన్నాయి, డోలు, గడ్డిబూర మొదలగు వాయిద్యాలతో పాటు మాట నేర్పరితనము వినయం నేర్పిస్తారు. నేటి రోజులలో సినిమాల సంగీత ప్రభావము ప్రజలలో ఉండినా, సిసలైన శాస్త్రీయ సంగీతము బాణి మా వృత్తిలోనే నిలచివున్నాయి. అందువలన ఎటు వంటి పోట్లగిత్తలయినా మా దగ్గరకు వచ్చినపుడు సాధువు లవుతాయి. అతి ప్రియమైన ఆహారం పిండి పెట్టి, ముక్కుతాడు వేస్తాము. రాములవారిని, ఆంజనేయుల వారిని పూజిస్తాము.

మా తల్లిదండ్రులకు మేము ఏడుగురు సంతానము నేను అయిదవ వాడిని. నా పేరు జోజన్న. నాకు పదిహేనవ ఏటనే విజయవాడ గుణదల వాస్తవ్యులు ఆవల వెంకన్న గారి పెద్దకుమార్తె కుమారితో వివాహం జరిగింది. నలుగురు పిల్లలు కలిగారు. ఇద్దరు మగపిల్లలు ఇద్దరు ఆడపిల్లలు.

గంగాలమ్మ జాతరలో గంగిరెద్దుల ప్రదర్శన ప్రారంభమై సంక్రాంతి పండుగ ముగింపు అయిన తర్వాత జూన్‌లో ఇండ్లకు తిరిగి వస్తాము. మేము మొత్తం మూడువందల కుటుంబాలు నివశిస్తున్నాము. పూర్వం విజయవాడ గుణదలలో మేము నివశించినందున ఈ ప్రాంతమును గంగిరెద్దుల దిబ్బ అని పిలుస్తున్నారు. ఆవిధముగా ఊర్లు తిరగటం కుటుంబమునకు దూరముగా ఉండినందున ఎక్కువగా త్రాగటం అలవాటయింది. డబ్బులు దండిగా ఉన్నప్పుడు త్రాగి రోడ్ల మీద పడిపోయేవాడిని. మతి స్థిమితం లేకుండినది.

విగ్రహారాధన చేసేవాడిని. దుర్గమ్మ గుడికి వెళ్ళేవాడిని. చాలా దీక్షగా ఉపవాసం చేస్తూ కూడా ఇంట్లో భార్యబిడ్డలను వేధించేవాడిని. విగ్రహారాధన చాలా భక్తితో ఉపవాసం ఉండి చేసేవాడిని. అలా చేస్తుండగా ఒకరోజు మా దగ్గరలో ఉన్న మేరీమాత గుడి వద్ద ఉన్న రోడ్డు మీద వెళుతుండగా అక్కడ నా భార్య యేసుప్రభు ఫోటో తీసుకు వచ్చింది. అయితే అది తీసుకువచ్చి నేను ఆరాధించే విగ్రహాల ఫోటోల మధ్యలో ఆ ఫోటో కూడా పెట్టింది. అయితే ఒకరోజు ఉపవాసం ఉండి నా దేవతలకు పూజ చేద్దామని గదిలోకి వెళ్ళాను. ఎప్పుడు నా దేవతలకు పూజచేసేటప్పు డెల్లా అమ్మవారు నా మీదకు వచ్చేది. అయితే ఆ రోజు గదంతా చీకటి కమ్మింది. అంత అయోమయంగా ఉంది. ఆ రోజు నేను చాలా ఆశ్చర్య పోయాను. కొద్ది క్షణముల తరువాత నేను ఎప్పుడూ చూడలేనంత వెలుగును చూడగలిగాను. మళ్ళీ కొద్ది క్షణముల తరువాత నేను స్వరం ద్వారా 'నా కుమారుడా!' అని అనడం మూడుసార్లు విన్నాను. వినిన తరువాత అప్పుడు 'అయ్యా! నీవు ఏ దేవుడవయ్యా?' అని అడిగాను. అప్పుడు ఒక స్వరం ద్వారా నేను నజరేయుడైన యేసును అన్న స్వరం నేను విన్నాను. ఆ స్వరం వినగానే నాలో చాల భయం కలిగింది. ఆ రోజు నుండి ఆ దేవుడు ఎవరో తెలుసుకోవాలని ఆశ కలిగింది. మెల్లమెల్లగా ఆ దేవుడు ఎవరో పూర్తిగా తెలుసు కున్నాను. ఆ తర్వాత మాకు తెలియక మేరీ మాత చర్చికి వెళ్ళేవాళ్ళం. అలాగు వెళుతూ ఉండగా కొన్నిరోజులు గడిచిన తరువాత ఒక ఇడ్లి అమ్మే పద్మ సాలీల అమ్మాయి రూతు మా వీధికి వచ్చింది. తను యేసుప్రభువును ఎరిగిన బిడ్డని ఆమె పాడిన పాట ద్వారా మేము తెలుసుకున్నాము. ఆమె ద్వారా మందిరమునకు వెళ్ళడం ప్రారంభించాము. ఆ తర్వాత ఒక విశ్వాసిగా చర్చికి వెళ్ళేవాడిని.

**...మిగతా 21వ పేజీలో**

ఉచితం! ఉచితం!! ఉచితం!!!

విద్యను అమ్ముతున్న కాలంలో విద్యాదానం చేస్తున్న

# I.E.R.F. మిషన్ విద్యా సంస్థలు

(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపబడిన సంస్థ)

బీద బడుగు వర్గాల విద్యార్థినీ విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు గొప్ప సదవకాశం. త్వరపడండి. ఒంగోలు, క్లౌపేట, 6వ లైను, కృపాదానంగారి వీధిలో ఉన్న I.E.R.F. సంస్థ గత 40 సంవత్సరాలుగా పేద బడుగువర్గాల అభ్యున్నతి కొరకు విద్యారంగంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టి రెసిడెన్షియల్ స్కూల్‌తో సమానంగా విద్యను అందిస్తుంది. గత ఏడాది మా U.C.L.I. స్కూల్‌నందు 10వ తరగతిలో 90% ఉత్తీర్ణత. అంతమాత్రమే కాక ఈ సంస్థలో చదివిన వారికి దైవానుగ్రహం కూడా మెండుగా లభిస్తుందని చెప్పటానికి ఋజువు ఈ సంస్థలో చదివిన వారు అనేకులు విదేశాలలో (అమెరికాలో) ఉద్యోగం చేస్తూ ఉండటం గమనార్హం. ఈ విధంగా పేద బడుగు వర్గాల అభ్యున్నతిని సాధిస్తున్న I.E.R.F. సంస్థ గత 2 సంవత్సరాలుగా 1,2,3 తరగతులకు ఉచితముగా కాన్వెంట్ స్థాయిలో ఇంగ్లీషు బోధన మొదలుపెట్టింది. టీచర్స్ ఇంగ్లీషు మాతృభాష అయిన ఇంగ్లండు దేశపు వారు కావటం ఇంకొక ప్రత్యేకత. మా స్కూలునందు ఎలిమెంటరీ పిల్లలు సైతం ఇంగ్లీషు మాట్లాడము గమనార్హం.

## మా స్కూలు ప్రత్యేకతలు

- ★ అన్ని తరగతుల విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.
- ★ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం మరియు ఒక జత యూనిఫాం ఉచితంగా ఇవ్వబడును.
- ★ విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా ఉచిత హాస్టల్ సౌకర్యం కలదు.
- ★ కులమత సంబంధం లేదు ఎవరైనా మా హాస్టల్‌లో చేరవచ్చును.
- ★ 1,2,3 తరగతులకు A/c Class Room సౌకర్యం కలదు.
- ★ ఎలిమెంటరీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం మరియు ఫ్యామిలీ సపోర్టు కలదు.
- ★ బాలికలకు ఉచితంగా G.N.M. నర్సింగ్, INTER శిక్షణ ఇప్పించబడును.
- ★ B.Sc. నర్సింగ్ వారికి స్వల్ప ఫీజులతో శిక్షణ.
- ★ 1 నుండి 10 వరకు అడ్మిషన్లు జరుగుచున్నవి. సీట్లు పరిమితం విచ్చేయండి.

సీట్లు పరిమితం కనుక ముందుగా సీటు రిజర్వ్ చేసుకొనవలెను.

మీ పిల్లల చక్కని భవిష్యత్ కొరకు ఉన్నత విద్యాబుద్ధుల కొరకు ఐ.ఈ.ఆర్.ఎఫ్. సంస్థలో చేర్పించండి.

ఇట్లు

**రెవ.డా॥ జోసఫ్ కొడవటికంటి,** కరస్పాండెంట్

సెల్ : 9676340371, 9704255416



# అక్షరయజ్ఞం



## బైబిల్ క్విజ్ - 10

శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. యెహోవా దేవుడు మోషేను ఫరోకి ఏమని నియమించెను?
2. ఫరోతో మాట్లాడినప్పుడు మోషే మరియు అహరోనుల వయస్సు ఎంత?
3. ఐగుప్తీయుల మీదకి వచ్చిన మొదట తెగులు ఏమిటి?
4. యెహోవా ఏటిని కొట్టిన తర్వాత ఎన్ని దినములకు యెహోవా మోషేతో మాట్లాడెను?
5. రెండవ తెగులు ఏమిటి అది ఏ అధ్యాయములో ఉన్నది?
6. పేలు రావటం ఎన్నవ తెగులు?
7. నాలుగవ తెగులు ఏమిటి?
8. ఏ దేశములో ఈగలుండవని దేవుడు మోషేతో చెప్పెను?
9. మోషే దేని విషయమై ఐగుప్తుయులకు హేయము అని చెప్పెను?
10. ఐగుప్తీయుల పశువులకేమాయెను అది ఎన్నో తెగులు?
11. అవపు బుగ్గి చల్లగానే ఐగుప్తులో ఏమి సంభవించెను?
12. ఏడవ తెగులు ఏమిటి?
13. వడగండ్లు ఆగిపోగానే ఏ చెట్టుకి పువ్వులు పూసెను?
14. ఏ మొలకలు చెడగొట్టబడలేదు?
15. వడగండ్లు పాడుచేసిన తర్వాత మిగిలిన పంటను ఏవి తినివేసెను?
16. యెహోవా దేవుడు మిడతలను ఎక్కడ పడవేసెను?
17. యెహోవా దేవుడు ఐగుప్తంతా ఎన్ని దినములు గాడాంధకారము చేసెను?
18. వేటిని తీసుకొని యెహోవా దేవుడు ఇశ్రాయేలీయులను పదనాలుగవ తేదివరకు తమ దగ్గర ఉంచుకోమనెను?
19. చంపిన గొఱ్ఱెల రక్తమును ఎక్కడ పూయమనెను?
20. ఆ రాత్రి కాల్చబడిన మాంసమును పొంగని రొట్టెలను వేటితో తినెను?
21. ఉదయము వరకు వారు రాత్రి తినిన వాటిలో ఏదైన మిగిలితే ఏమి చేయవలెనని యెహోవా ఆజ్ఞాపించెను?
22. ఏ విధముగా యెహోవా వారిని తినమనెను?
23. ఈ దినమునకు గుర్తుగా ఎన్ని దినములు పులియని రొట్టెలను తినమనెను?
24. మొదటి దినము ఏడవ దినము ఇశ్రాయేలీయులను ఎలా కూడుకొనమనెను?
25. పులిసిన రొట్టెను తినువాడిని ఏమి చేయునని యెహోవా దేవుడు చెప్పెను?

గత నెల ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**పి. చిన్నారావు**

బాప్టిస్టునగర్, విజయవాడ-3

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.